TGTEL/25/A3603

# కింగ్

డైలీ న్యూస్ పేపర్

King Daily News Paper

PUBLISHED FROM HYDERABAD AND VIJAYAWADA

హైదరాబాద్ సంపుటి: 01 సంచిక : 221 శనివారం, జూన్ 27, 2026 పేజీలు :8 వెల.1/-

ఆరోగ్యవంతమైన మెడ్చల్ కోసం నమ్మకమైన వైద్య నిపుణులు

అత్యుత్తమమైన సేవలు,

ప్రతి అడుగులో మరింత శ్రద్ధ.

జైత్ర

మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

మా ప్రత్యేకతలు

- అత్యవసర & క్రిటికల్ కేర్
- ప్రమాద సేవలు
- ప్రసూతి & గైనకాలజీ
- ఆర్థోపెడిక్స్
- జాయింట్ రీప్లేస్‌మెంట్స్
- జనరల్ మెడిసిన్
- జనరల్ సర్జరీ
- మ్యాక్సిలో ఫేషియల్ సర్జరీ
- పిల్లల వైద్యం & శిశు సంరక్షణ
- న్యూరాలజీ • న్యూరోసర్జరీ
- ప్లాస్టిక్ సర్జరీ • పల్మనాలజీ
- యూరాలజీ • డెర్మటాలజీ
- సైకియాట్రీ • ఫిజియోథెరపీ




నమ్మకమైన వైద్యం | నైతిక వైద్య సేవలు | చికిత్సే ముందుగా | నిపుణుల క్లినికల్ సంరక్షణ

అన్ని ఇన్సూరెన్స్ క్యాష్‌లెస్ సౌకర్యం | 24/7 అత్యవసర సేవలు | అత్యాధునిక అంబులెన్స్

+91 85230 89599 +91 86889 09384

www.jaitrahospitals.com • ITI పక్కన, NH 44, చంద్ర నగర్, మెడ్చల్, తెలంగాణ - 501401.

## డ్రగ్స్‌పై పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి: సీఎం రేవంత్



హైదరాబాద్, జూన్ 26: సమాజాన్ని డ్రగ్స్ నాశనం చేస్తాయి. డ్రగ్స్‌పై పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు కీలక సందేశాన్ని ఇచ్చారు. తెలంగాణను డ్రగ్స్ లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల మహమ్మారి కేవలం ఒక వ్యక్తిని మాత్రమే కాకుండా, వారి కుటుంబాలతో పాటూ మొత్తం సమాజాన్నే నాశనం చేస్తుందన్నారు. డ్రగ్స్ బారిన పడకుండా యువత ఎల్లప్పుడూ వీటికి దూరంగా ఉండాలని సీఎం హితవు పలికారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో యువత పాత్ర అత్యంత కీలకమని, అందుకోసం వారు స్వచ్ఛందంగా ముందుకు రావాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కేవలం చట్టాలు, పోలీసుల చర్యల వల్లే కాకుండా.. ప్రజల్లో సరైన అవగాహన పెంచడం ద్వారానే మాదక ద్రవ్యాల నియంత్రణ పూర్తిగా సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా అక్రమ డ్రగ్స్ రవాణాను అరికట్టేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ సామాజిక బాధ్యతగా భావించి సహకరించాలని కోరారు. యువత డ్రగ్స్ వైపు వెళ్లకుండా ఉండేందుకు.. వారిలో సానుకూల ఆలోచనలు, నైతిక విలువలను పెంపొందించడం ఎంతో ముఖ్యమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సమాజంలో మాదక ద్రవ్యాల వల్ల జరిగే నష్టాలపై నిరంతరం అప్రమత్తత పెంచాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మహమ్మారిని రూపుమాపడానికి అందరం కలిసికట్టుగా చేసే సమిష్టి పోరాటమే శాశ్వత పరిష్కారమని, డ్రగ్ ఫ్రీ తెలంగాణ కోసం ప్రతి పౌరుడూ నడుం బిగించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

## ప్రభుత్వ ఉద్యోగులకు ప్రజా ప్రభుత్వం బంపర్ ఆఫర్

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్ తెలంగాణ రాష్ట్రంలోని లక్షలాది మంది ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాల్లో భద్రత, భరోసా కల్పించేందుకు ప్రజా ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని క్యాబినెట్ ఉద్యోగుల సంక్షేమం కోసం దేశ చరిత్రలోనే ఎక్కడా లేని విధంగా సరికొత్త ఉచిత బీమా పథకాన్ని ఆమోదించిందని ఆయన వెల్లడించారు. ఈ పథకం ద్వారా అటు ప్రభుత్వంపై కానీ, ఇటు ఉద్యోగులపై కానీ ఒక్క రూపాయి కూడా అదనపు భారం పడకుండా, బ్యాంకులతో మాట్లాడి ఈ భారీ బీమా రక్షణను కల్పిస్తున్నట్లు స్పష్టం చేశారు.?ఈ అద్భుతమైన బీమా పథకం ద్వారా సాధారణ ప్రమాదాల్లో మరణిస్తే రూ. కోటి 25 లక్షలు, అదే విమాన ప్రమాదం జరిగితే రూ. 2 కోట్ల నుంచి రూ. 3 కోట్ల వరకు బీమా పరిహారం అందుతుందని భట్టి విక్రమార్క వివరించారు. 18 నుంచి 60 సంవత్సరాల వయస్సు గల ఉద్యోగులకు రూ.10 లక్షల జీవిత బీమా రక్షణ ఉంటుందన్నారు. ప్రమాదవశాత్తూ శాశ్వత సంపూర్ణ వైకల్యం లేదా పాక్షిక వైకల్యం సంభవించినా ఈ పథకం ద్వారా ఉద్యోగులకు ఆర్థిక అండ లభిస్తుందన్నారు. కేవలం రెగ్యులర్ ఉద్యోగులకే కాకుండా..నెలనెలా ప్రభుత్వ రికార్డుల ద్వారా జీతం పొందే కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, ఇతర తాత్కాలిక ఉద్యోగులందరికీ ఈ పథకాన్ని వర్తింపజేస్తున్నట్లు డిప్యూటీ సీఎం ప్రకటించారు.?తమ కుటుంబంలో సంపాదించే వ్యక్తికి ఏదైనా ఆపద వస్తే ఆ కుటుంబం రాత్రికి రాత్రే రోడ్డున పడే పరిస్థితి ఉండకూడదు. ఉద్యోగులు కేవలం జీతగాళ్లు కాదు, వారి కుటుంబాలకు ఈ ప్రభుత్వం ఒక పెద్ద దిక్కుగా ఉంటుందని నమ్మకం కలిగించడమే మా లక్ష్యమని భట్టి విక్రమార్క చెప్పారు. ?గత



ప్రభుత్వ హయాంలో జీతాలు 15 లేదా 20వ తేదీ వరకు రాకపోవడం వల్ల ఉద్యోగులు పడిన ఇబ్బందులను భట్టి విక్రమార్క గుర్తుచేశారు. ప్రస్తుత కాలంలో ఇళ్లు, వాహనాలు, పిల్లల చదువుల కోసం ప్రతి ఒక్కరూ బ్యాంక్ ఇన్‌స్టాల్మెంట్స్ ఈఎంఐలు, కడుతున్నారు. సకాలంలో జీతాలు రాకపోతే వారి అకౌంట్లు బ్యాడ్ అకౌంట్స్‌గా మారి సిబిల్ స్కోర్ దెబ్బతినేది.మా ప్రభుత్వం రాగానే ఆర్థిక పరిస్థితి గందరగోళంగా ఉన్నప్పటికీ, సీఎం రేవంత్ రెడ్డి ఉద్యోగుల హక్కులను కాపాడాలి అని గట్టిగా నిర్ణయించుకుని, ఒకటో తేదీ నాడే జీతాలు ఇచ్చేలా కఠినమైన ప్రణాళికను అమలు చేశారని అన్నారు.

## సీఎస్ కు కీలక పదవి

### కేసీఆర్ బాటలో రేవంత్

హైదరాబాద్, జూన్ 26: ఎం రేవంత్ రెడ్డి సలహాదారుగా ప్రస్తుత సీఎస్ కే రామకృష్ణారావును నియమించారు. అయితే రామకృష్ణారావు ప్రస్తుతం సీఎస్‌గా పనిచేస్తుండగా.. ఈనెల 30న పదవీ విరమణ చేయనున్నారు. పదవీ విరమణ తర్వాత ఆయన సీఎంకు సలహాదారుగా వ్యవహరించనున్నారు. అయితే గతంలో మాజీ సీఎం కేసీఆర్ కూడా.. ఇలా పదవీ విరమణ చేసిన సీఎస్‌లను తన సలహాదారులుగా నియమించుకున్నారు. ఇప్పుడు అదే బాటలో సీఎం రేవంత్ రెడ్డి నడుస్తుండటం గమనార్హం.తెలంగాణ ప్రభుత్వం ఒకే రోజు పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈనెల 30వ తేదీతో తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావు పదవీ కాలం ముగియనుండటంతో.. కొత్త సీఎస్‌గా సంజయ్ జాజును నియమిస్తూ కీలక ఉత్తర్వులు వెలువరించింది. అదే సమయంలో పదవీ విరమణ తర్వాత రామకృష్ణారావుకు కీలక పదవి కూడా అప్పగించింది. ముఖ్యమంత్రి సలహాదారుగా కే రామకృష్ణారావును నియమిస్తూ.. ప్రకటన విడుదల చేసింది. అయితే గతంలో ముఖ్యమంత్రిగా పనిచేసిన కేసీఆర్ కూడా.. తన హయాంలో ఇలాగే రిటైర్ అయిన సీఎస్‌లను ప్రభుత్వ సలహాదారులుగా నియమించారు. ఈ క్రమంలోనే అప్పుడు కేసీఆర్ అనుసరించిన మార్గాన్నే ఇప్పుడు రేవంత్ రెడ్డి కూడా అనుసరిస్తున్నారు అంటూ రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు.సీనియర్ ఐఏఎస్ అధికారి అయిన కె. రామకృష్ణారావును ముఖ్యమంత్రి సలహాదారుగా నియమిస్తూ.. సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ) ప్రిన్సిపల్ సెక్రటరీ (పొలిటికల్) ఎం. రఘునందన్ రావు శుక్రవారం అధికారిక ఉత్తర్వులు వెలువరించారు. రామకృష్ణారావు ఈనెల 30వ తేదీన రిటైర్ అయిన వెంటనే ముఖ్యమంత్రికి సలహాదారుతో పాటు ఎక్స్ అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీగా కొత్త బాధ్యతలు స్వీకరించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన జీవోలో వెల్లడించింది. ఈ క్రమంలోనే సీఎం సలహాదారుగా కే రామకృష్ణారావు నియామక కాలపరిమితితోపాటు.. ఆయనకు ఇచ్చే జీతభత్యాలు.. ఇతర సేవా నిబంధనలు, కండీషన్లను త్వరలోనే జారీ చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం తేల్చి చెప్పింది. ఈ నేపథ్యంలోనే గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కూడా సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు.. పదవీ విరమణ తర్వాత



కీలక బాధ్యతలను అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ అప్పగించారు. ఇలా రిటైర్ అయిన సీనియర్ అధికారులకు కొత్త బాధ్యతలు అప్పగించే సాంప్రదాయాన్ని కేసీఆర్ తీసుకొచ్చారు.తెలంగాణ ఏర్పడిన తర్వాత మొదటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన డాక్టర్ రాజీవ్ శర్మ.. 2016 డిసెంబర్‌లో పదవీ విరమణ చేశారు. ఆ వెంటనే.. డాక్టర్ రాజీవ్ శర్మను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారుగా కేసీఆర్ నియమించారు. ఈ క్రమంలోనే ఆయనకు కేబినెట్ హోదాను కూడా కల్పించారు. కేసీఆర్‌కు అత్యంత నమ్మకస్తుడైన ఐఏఎస్ అధికారిగా పేరు తెచ్చుకున్న సోమేష్ కుమార్‌కు కూడా కేసీఆర్ పదవి ఇచ్చారు. క్యాట్ ఆర్డర్ వివాదంలో తెలంగాణ హైకోర్టు తీర్పు కారణంగా ఆయన 2023 జనవరిలో తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పదవి నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు వెళ్లిన సోమేష్ కుమార్.. ఆ తర్వాత స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్ఎస్) తీసుకున్నారు. ఈ క్రమంలోనే సోమేష్ కుమార్ వీఆర్ఎస్ తీసుకున్న వెంటనే 2023 మేలో ఆయనను సీఎం ముఖ్య సలహాదారుగా నియమించారు. సోమేష్ కుమార్‌కు కేబినెట్ హోదా ఇచ్చి 3 ఏళ్ల కాలపరిమితితో ఆ పదవిలో నియమించారు.రాజీవ్ శర్మ తర్వాత తెలంగాణ సీఎస్‌గా పనిచేసిన ఎస్‌కే జోషి కూడా పదవీ విరమణ చేసిన వెంటనే కేసీఆర్ ప్రభుత్వంలో నీటిపారుదల శాఖ సలహాదారుగా నియమితులు అయ్యారు. ఇక కేవలం ఐఏఎస్ అధికారులే కాకుండా.. ఐపీఎస్ అధికారులకు కూడా రిటైర్మెంట్ తర్వాత పదవులు దక్కాయి. తెలంగాణ తొలి డీజీపీగా పనిచేసిన అనురాగ్ శర్మ.. పదవీ విరమణ చేసిన వెంటనే ఆయనను హోంశాఖ సలహాదారుగా కేసీఆర్ ప్రభుత్వం నియమించింది.ప్రభుత్వాలు మారినా లేక పరిపాలనలో వేగం పెంచాలన్నా.. సీనియర్ అధికారుల సుదీర్ఘ అనుభవం, కీలక శాఖలైన ఆర్థిక, శాంతిభద్రతలు, నీటిపారుదలపై వారికి ఉన్న పట్టు రాష్ట్ర ప్రభుత్వానికి ఎంతో అవసరం ఉంటుంది. అందుకే వారు రిటైర్మెంట్ అయిన తర్వాత కూడా.. ప్రభుత్వ అవసరాల మేరకు వారికి ప్రత్యేక పదవులు ఇస్తూ ఉంటారు. అంతేకాకుండా.. ప్రభుత్వాల్లో కీలకమైన పాలనాపరమైన లూప్‌హోల్స్, బడ్జెట్ రహస్యాలు, రాజకీయ వ్యూహాలు తెలిసి ఉన్న నమ్మకమైన అధికారులను రిటైర్మెంట్ తర్వాత వదిలేయకుండా.. తమతోనే ఉంచుకోవడానికి ముఖ్యమంత్రులు, ప్రభుత్వాలు వారికి ఇలాంటి పదవులను కట్టబెట్టి ఘనంగా వీడ్కోలు ఇస్తుంటారు.

## ఈ వారంలోనే కేంద్ర క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణ..



రాష్ట్రపతిని కలిసిన అమిత్ షా

న్యూ ఢిల్లీ, ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలోని మంత్రివర్గంలో కీలక మార్పులు జరగబోతున్నట్లు సమాచారం. ఈ వారమే మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ చేపట్టబోతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ అంశంపై వివరించేందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్మును గురువారం కేంద్ర హోం మంత్రి అమిత్ షా కలిశారు. మరోవైపు బీజేపీలోనూ సంస్థాగత నిర్మాణంలో మార్పులు జరగనున్నాయి. కేంద్రం మంత్రివర్గంతోపాటు బీజేపీ కేంద్ర పదవుల్లోనూ మార్పులు చోటు చేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.దీనిపై బీజేపీ జాతీయాధ్యక్షుడు నితిన్ నబీన్ చర్చలు, సంప్రదింపులు జరుపుతున్నారు. తన కొత్త టీంను ఎన్నుకునే పనిలో ఉన్నారు. బీజేపీలో పదవుల నియామకం, మార్పులు వంటివి ఈ నెలాఖరులోపు పూర్తవుతాయి. మంత్రివర్గంలో మార్పులు, చేర్పుల గురించి కొందరు కేంద్ర మంత్రులతో కూడా నితిన్ నబిన్ ఇదివరకే మాట్లాడినట్లు తెలుస్తోంది. ఉత్తరప్రదేశ్, బీజేపీ కార్యవర్గాన్ని కూడా ఇటీవల మార్చిన సంగతి తెలిసిందే. రాబోయే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని యూబీ బీజేపీ కార్యవర్గంలో మార్పులు చేశారు. ఇదే సమయంలో కేంద్ర మంత్రివర్గ పునర్వ్యస్థీకరణకు సంబంధించి తగిన ఏర్పాట్లు జరుగుతున్నాయి. కొందరు మంత్రులకు ఇటీవల పార్టీ పరమైన బాధ్యతల్ని కూడా అధిష్టానం అప్పగించింది. ఇటీవలే కేంద్ర మంత్రి జార్జ్ కురియన్ తన పదవికి రాజీనామా చేశారు.అలాగే, ఇటీవలే కొందరు కొత్తగా ఎంపీలుగా రాజ్యసభలోకి అడుగుపెట్టారు. వీరిలో కొందరికి కేంద్ర మంత్రి పదవులు దక్కే అవకాశాలున్నాయి. అయితే, ఈ అంశంపై మోదీ, అమిత్ షా సహా బీజేపీ నాయకత్వం పూర్తి గోప్యత పాటిస్తోంది. మోదీ తన చర్యల్ని చివరి నిమిషం వరకు వెల్లడించరు. అందువల్ల మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై అధికారిక ప్రకటన వరకు ఎదురు చూడాల్సిందే.

## ఆపరేషన్ సింధూర్‌లో ఆరుగురు సైనికులు వీరమరణం..

### తొలిసారి పేర్లను వెల్లడించిన ప్రభుత్వం

న్యూఢిల్లీ: పాకిస్థాన్‌లో ఉగ్రమూకల్ని అంతం చేసేందుకు భారత సైన్యం గత ఏడాది మే నెలలో ఆపరేషన్ సింధూర్ చేపట్టిన విషయం తెలిసిందే. పెహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా చేపట్టిన ఆపరేషన్ సింధూర్‌లో ఆరుగురు భారతీయ సైనిక సిబ్బంది మృతిచెందినట్లు ఇవాళ ప్రభుత్వం పేర్కొన్నది. ఆ ఆపరేషన్‌లో వీరమరణం పొందిన ఆ సైనికులు పేర్లను కూడా వెల్లడించారు. దేశ రాజధానిలో ఉన్న జాతీయ యుద్ధ స్మారకంపై ఆ ఆరుగురు సైనికుల పేర్లను చేర్చనున్నట్లు సైన్యం తెలిపింది. మిలిటరీకి చెందిన సుబేదార్ మేజర్ పవన్ కుమార్, రైఫిల్‌మాన్ సునిల్ కుమార్, లాన్స్ నాయక్ దినేశ్ కుమార్, అగ్నివీర్ మురళీ నాయక్, హవిల్దార్ సునిల్ కుమార్ సింగ్‌తో పాటు భారతీయ వైమానిక దళానికి చెందిన సురేంద్ర కుమార్ ఉన్నారు.ఆపరేషన్ సింధూర్‌లో ప్రాణాలు కోల్పోయిన ఆరుగురు వీర సైనికులతో పాటు 2025లో జరిగిన వివిధ మిలిటరీ ఆపరేషన్స్‌లో అమరులైన సైనికుల పేర్లను రిలీజ్ చేశారు. నేషనల్ వార్ మెమోరియల్‌లో ఉన్న త్యాగ చక్ర వద్ద ఆ ఆరుగురు సైనికుల పేర్లను రాయనున్నారు. పాకిస్థాన్‌తో పాటు పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉన్న ఉగ్రవాద క్యాంపులపై గత ఏడాది మే 7వ తేదీన భారతీయ సైనిక దళాలు అటాక్ చేసిన విషయం తెలిసిందే. అయితే ఆపరేషన్ సింధూర్‌ను పాక్ తిప్పికొట్టే ప్రయత్నం చేసింది. ఆ సమయంలో డ్రోన్ దాడులు, షెల్లింగ్, వైమానిక అటాక్‌లు జరిగాయి. రెండు దేశాల మధ్య నాలుగు రోజుల పాటు భీకర ఘర్షణ జరిగింది. ఆ తర్వాత మే 10వ తేదీన వార్ ముగిసింది.

## ఐఏఎస్ బదిలీలు

హైదరాబాద్, జూన్ 26: రాష్ట్రంలో పలువురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ.. తెలంగాణ ప్రభుత్వం కీలక ఉత్తర్వులు వెలువరించింది. ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణరావును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సలహాదారుగా నియమించింది. ఈ క్రమంలోనే మొత్తం 13 మంది ఐఏఎస్ అధికారులకు.. బదిలీలు, పోస్టింగ్‌లు కల్పించింది. అదే సమయంలో సీఎంఓ నుంచి అజిత్ రెడ్డిని తొలగించింది. ఈ నేపథ్యంలోనే సీనియర్ ఐఏఎస్ శ్రీధర్‌కు సీఎంఓలో కీలక బాధ్యతలు అప్పగించారుఈ క్రమంలోనే సబ్యసాచి ఘోష్‌కు హ్యాండ్లూమ్స్, టెక్స్‌టైల్స్ శాఖ కార్యదర్శిగా అదనపు బాధ్యతలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం అప్పగించింది. అదే సమయంలో శైలజా రామయ్యర్‌ను ఈఎఫ్ఎస్ అండ్ టీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా బదిలీ చేసింది. అహ్మద్ నదీమ్‌కు పొలిటికల్ (జీఏడీ) ప్రిన్సిపల్ సెక్రటరీగా బాధ్యతలు అప్పగించింది. ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీగా ఎన్ శ్రీధర్.. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీగా రాహుల్ బొజ్జాకు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతలు ఇచ్చింది.మైన్స్ అండ్ జియాలజీ శాఖ అదనపు బాధ్యతలను ఎం.రఘునందన్ రావుకు రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. ఇన్వెస్ట్ తెలంగాణ సీఈవోగా అజిత్ రెడ్డిని ట్రాన్స్‌ఫర్ చేసింది. హ్యాండ్లూమ్స్ అండ్ హ్యాండీక్రాఫ్ట్స్ స్పెషల్ సెక్రటరీగా పి. కాత్యాయని దేవికి పోస్టింగ్ ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం.. ఆర్అండ్‌బీ శాఖ స్పెషల్ సెక్రటరీగా కె. గంగాధర్‌ను బదిలీ చేసింది. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్‌గా టి. వెంకన్నకు పోస్టింగ్ ఇచ్చింది. టూరిజం డైరెక్టర్‌గా కె. విద్యాసాగర్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.ఈ క్రమంలోనే తెలంగాణ ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంఓ)లో కీలకమైన మార్పులకు రేవంత్ రెడ్డి సర్కార్ శ్రీకారం చుట్టారు. పాలనా యంత్రాంగాన్ని మరింత పరుగులు పెట్టించడంలో భాగంగా సీఎంవోలో భారీ ప్రక్షాళన చేపట్టింది. గత కొంతకాలంగా సీఎంవోలో కీలక బాధ్యతల్లో ఉన్న అజిత్ రెడ్డిని తీసేసి.. శ్రీధర్‌కు చోటు కల్పించారు. శ్రీధర్ రాకతో సీఎంవోలో పాలనాపరమైన నిర్ణయాలు మరింత వేగం పుంజుకుంటాయని తెలంగాణ సచివాలయ వర్గాలు ఆకాంక్షిస్తున్నాయి.

# సంపాదకీయం

**శనివారం, జూన్ 27, 2026**

## త్రిశూల్ వ్యూహంలో ఎన్డీఏ

నాలుగోసారి అధికారమే లక్ష్యంగా పావులు కదుపుతోంది. త్రిశూల వ్యూహంతో పక్కా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. సర్, డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల బిల్లులతో ప్రత్యర్థులను ఇరుకున పెట్టాలని ప్రయత్నిస్తోంది. బీహార్, బెంగాల్‌లో అనుసరించిన ఫార్ములానే?2029 ఎన్నికల్లో అమలు చేసేందుకు రెడీ అవుతోంది. ఇదే ఇవాళ్టీ స్టోరీ బోర్డు. దేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ఉంది. ఇక్కడ ఎన్నికలదే కీలక పాత్ర. అలాంటప్పుడు ఓటర్ల విషయంలో వారి అర్హతలను ఎప్పటికప్పుడు సరిచూసుకోవటం చాలా అవసరం. ఈ ఉద్దేశంతోనే సర్ ప్రక్రియకు రూపకల్పన జరిగింది. కాకపోతే ఇప్పుడు జరుగుతున్నది సర్ కాదు ఓట్ల చోరీ అని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఈసీ మాత్రం అవన్నీ అపోహాలేనని కొట్టిపారేస్తోంది.దేశంలో ఓటర్ల జాబితాను అప్పుడప్పుడూ సవరించడం తప్పనిసరి. అర్హులకు చోటు కల్పించి అనర్హులపై వేటు వేసేందుకు సర్ నిర్వహించడమూ అవసరమే. దీని పై ఎవరికీ ఎలాంటి అభ్యంతరం ఉండనవసరం లేదు. ఈ విషయమై ఎన్నికల సంఘానికి ప్రజాప్రాతినిధ్య చట్టం -1951 పూర్తి స్వేచ్ఛను కల్పించింది. ఈసీ ఈ విషయం లో ఎవరి అనుమతి తీసుకోవాల్సిన లేదా ఎవరికీ జవాబుదారీ వహించాల్సిన అవసరం లేదు. దేశంలో ఇలాంటివి జరగడం ఇదే కొత్త కూడా కాదు. 1952 నుంచి 2004 వరకు 13 సార్లు సర్ జరిగింది. కానీ, ప్రస్తుత సర్వే స్థాయిలో అవేవీ వివాదాల్లో చిక్కుకోలేదు. అయితే ఎన్నికల కమిషన్ విశ్వసనీయత కొడిగట్టిన ప్రస్తుత తరుణంలో దేశవ్యాప్తంగా జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణ వివాదాల సుడిగుండంలో చిక్కుకుంది. సర్ పేరిట జరుగుతున్న తతంగమంతా బీజేపీకి సానుకూలత, విపక్షాలకు ప్రతికూలత కల్పించేందుకేనని, అందుకు కృత్రిమమైనరీతిలో చేర్పులు, ప్రక్షాళనలు జరుగుతున్నాయని ప్రధానమైన ఆరోపణ. పనిలోపనిగా పౌరసత్వ పరీక్షలూ జరుగుతున్నాయనేది మరో ఆరోపణ.దాదాపు 20 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఎన్నికల సంఘం సర్వే చేపట్టింది. అందులోనూ మొదటి విడతగా బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలకు ముందు నిర్వహించడంపై ఇప్పటికే తీవ్ర దుమారం చెలరేగింది. మార్పుల తర్వాత జాబితాలో 50 లక్షలకు పైగా ఓటర్ల పేర్లు గల్లంతు కావడంపై పార్లమెంటు కూడా దద్దరిల్లింది. ఈ వివాదం ఒక కొలిక్కి రాకుండానే దేశమంతటా సర్ కార్యక్రమం చేపట్టనున్నట్టు ఎన్నికల కమిషన్ గత అక్టోబర్ 27న ప్రకటించింది. దీనిపై విపక్ష పాలిత రాష్ట్రాలు తీవ్ర వ్యతిరేకత తెలిపాయి. ముఖ్యంగా తమిళనాడు, పశ్చిమబెంగాల్ ప్రతిఘటించి తీరుతామని శపథం పూనాయి. కానీ తీవ్ర నిరసనల మధ్యే సర్ ప్రక్రియ పూర్తయింది. ఎన్నికల్లో తమ ఓటమికి సర్ తోనే పునాది పడిందని బెంగాల్లో మమతా బెనర్జీ సుప్రీందాకా వెళ్లి మరీ ప్రతిఘటించారు. దీంతో సుప్రీంకోర్టు సర్ ప్రక్రియ కోసం జ్యుడీషియల్ అధికారులను నియమించింది. చివరకు వారిని కూడా ఘెరావ్ చేసే దుస్థితి రావడం, తమ ఆదేశాల్ని కూడా బెంగాల్ రాష్ట్ర యంత్రాంగం బేఖాతరు చేయడాన్ని సుప్రీం తీవ్రంగా పరిగణించింది. కేంద్ర బలగాల రక్షణలో సర్ జరగాల్సిందేనని, సర్‌కు ఎక్కడైనా ఆటంకాలు ఎదురైతే చూస్తూ ఊరుకునేది లేదని సుప్రీంకోర్టు హెచ్చరించింది. సర్ నిబంధనల మేరకు జరగకపోతే ఆధారాలతో ఫిర్యాదు చేయొచ్చు కానీ.. అసలు ప్రక్రియనే వద్దనడం పద్ధతి కాదని సర్వోన్నత న్యాయస్థానం పార్టీలకు తలంటింది.ఉత్తరప్రదేశ్ సర్‌లో ఏకంగా సుమారు 20 శాతం ఓటర్ల పేర్లు, అంటే 2.89 కోట్ల ఓట్లు గల్లంతవడం కలకలం రేపింది. రాష్ట్రంలోని మొత్తం ఓట్ల సంఖ్య 15.44 కోట్ల నుంచి 12.55 కోట్లకు తగ్గిపోయింది. ఇక రాజధాని లక్నోలో 39.9 లక్షల ఓట్లుంటే అందులో 30 శాతం సర్వేలో ఎగిరిపోయి చివరకు 27.9 లక్షలే మిగిలాయి. అందులో కొందరు ఓటర్లు చనిపోయారని, మరికొందరు వేరే ప్రాంతాలకు వలసపోయారని, ఇంకొందరి పేర్లు రెండు లేదా అంతకంటే ఎక్కువచోట్ల ఉన్నాయని కమిషన్ వివరణ ఇచ్చింది. ఏదేమైనప్పటికీ భారీ స్థాయిలో ఓట్ల తొలగింపుపై రాజకీయ విమర్శలు, ప్రతివిమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సర్ కార్యక్రమం వల్ల ఓటర్లలో కొన్ని వర్గాలు తీవ్ర ప్రభావానికి గురయ్యాయని ప్రధాన ప్రతిపక్షమైన సమాజ్‌వాదీ పార్టీ ఆరోపించింది.సర్‌పై సర్వోన్నత న్యాయస్థానంలో తమిళనాడు న్యాయపోరాటానికి దిగింది. ఎన్నికల సంఘం చేపట్టిన సవరణకు ఎలాంటి రాజ్యాంగ బద్ధత, చట్టబద్ధత లేదని, పారదర్శకత, సమన్యాయం లోపించాయని ఆరోపించింది. బెంగాల్‌లో ఏకంగా నోబెల్ బహుమతి గ్రహీత అమర్త్యసేన్‌కు సర్ యంత్రాంగం విచారణ నోటీసు పంపించడంపై వివాదం రేగింది. దేశ విభజన నుంచి బంగ్లా యుద్ధం దాకా అనేక చారిత్రక కారణాల వల్ల బెంగాల్‌లో పౌరసత్వ సమస్యలున్నాయి. సర్ పేరిట దొడ్డిదారిన సిటిజన్‌షిప్ రిజిస్టర్‌ను ప్రవేశపెడుతున్నారని టీఎంసీ మండిపడింది. ఈ వివాదాల వెనుక నిజానిజాల మాట అటుంచితే, ప్రజలకూ, పార్టీలకూ సర్‌పై అంతులేనన్ని అనుమానాలున్నాయన్న మాట నిజం. పార్టీలు ఎప్పుడూ లేని విధంగా ఎన్నికల సంఘంపై కూడా నమ్మకం ఉంచటం లేదు. అయితే బెంగాల్ సర్ విషయంలో అభ్యంతరాలను లిఖితపూర్వకంగా తెలియజేయాలని అడిగితే.. ఏ పార్టీ నుంచీ స్పందన రాలేదు. కనీసం తుది జాబితాపై అభ్యంతరాలు అడిగినా.. ఎవరూ ముందుకు రాలేదు. తగినంత సమయం ఇచ్చిన తర్వాత కూడా ఎలాంటి స్పందన లేకపోవడంతో.. సర్‌ను రాజకీయ వివాదంగా మార్చొద్దని సుప్రీంకోర్టు చెప్పాల్సి వచ్చింది.ప్రస్తుతం తెలంగాణలో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ.. సర్ ప్రక్రియను సజావుగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని ఎన్నికల కమిషన్‌ను పీసీసీ కోరింది. రాష్ట్రంలో ఎన్నికలకు ఇంకా రెండేళ్లకు పైగా సమయం ఉన్నందున ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా 2-3 నెలల్లో హడావిడిగా ముగించకుండా, ఏడాదిన్నరపాటు జాగ్రత్తగా చేయాలని సూచించింది. సర్‌లో ఓటు తొలగిస్తే దరఖాస్తు చేసుకోవడానికి గడువును 3 నెలలకు పెంచాలని విజ్ఞప్తి చేసింది. ఇప్పటికే జనగణన ప్రక్రియ జరుగుతున్నందున దాంతోపాటే సర్ నిర్వహిస్తే.. సిబ్బందిపై ఒత్తిడి పెరుగుతుందనే ఆందోళ కూడా ఉంది.

**- ఎడిటర్**

# డ్రగ్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరు బాధ్యత వహించాలి :పోలీస్ కమిషనర్




నిజామాబాద్, జూన్26;డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలి : పోలీస్ కమిషనర్ వెల్లడిఅంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీసు ల ఆధ్వర్యంలో 2 కే రన్ కార్యక్రమం నిర్వహణసే నో టు డ్రగ్స్ సే ఇస్ టు లైఫ్ అని పిలుపునిచ్చారువివిధ పాఠశాలల నుండి 3000 మంది విద్యార్థినీ విద్యార్థులు , ప్రజలు పాల్గొన్నారు.డ్రగ్స్ నిర్మూలనలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని , యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడటం అందరి బాధ్యత అని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయిచైతన్య అన్నారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నిజామాబాద్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిజామాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ ఐఎంఏ డాక్టర్స్ సహకారంతో డ్రగ్స్ నియంత్రణ అవగాహన కార్యక్రమం నిర్వహించిన 2కే రన్ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యఅతిథి మాట్లాడుతూ , వేదికపై ఉన్న నిజామాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ సభ్యులు , ఐఎంఏ ప్రతినిధులు , కార్యక్రమాన్ని విజయవంతం చేసిన పోలీసు అధికారులు , సభ్యులకు అభినందనలు తెలిపారు.చిన్న చిన్న మంచి అలవాట్లతోనే సమాజంలో పెద్ద మార్పు తీసుకురావచ్చని అన్నారు. డ్రగ్స్ సమస్య కొత్తది కాదని , దేశాన్ని బలహీనపర్చేందుకు శత్రు దేశాలు యువతను లక్ష్యంగా చేసుకుని డ్రగ్స్ వ్యాప్తిని ప్రోత్సహిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. దేశ బలం యువతేనని , వారిని మత్తు పదార్థాలకు బానిసలుగా మార్చే కుట్రలను ప్రతి ఒక్కరూ అడ్డుకోవాలని పిలుపునిచ్చారు.డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే 1908 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా పోలీసులకు సమాచారం అందించాలని , సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతామని తెలిపారు. డ్రగ్స్ నియంత్రణ కోసం కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు భారీగా నిధులు వెచ్చిస్తున్నాయని , ఈ సమస్య లేకుంటే ఆ నిధులను విద్య వంటి అభివృద్ధి రంగాలకు వినియోగించే అవకాశం ఉండేదని చెప్పారు. రానున్న రెండు నుంచి మూడు నెలల పాటు జిల్లాలోని అన్ని పాఠశాలలు , ఇంటర్మీడియట్ కళాశాలలు , ప్రొఫెషనల్ కళాశాలల్లో విస్తృత స్థాయిలో డ్రగ్స్ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు. ప్రతి ఒక్కరూ "సే నో టూ డ్రగ్స్ ? సే ఎస్ టూ లైఫ్ అనే నందేశాన్ని నమాజంలోకి తీనుకెళ్లాలని పిలువునిచ్చారు.తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కంకణం కట్టుకుని కృషి చేయాలని పోలీస్ కమిషనర్ పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా డాక్టర్ కవిత రెడ్డి మాట్లాడుతూ , రాష్ట్ర ముఖ్యమంత్రి డ్రగ్స్ నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. పోలీస్ శాఖలో ఈగల్ బృందం డ్రగ్స్ నియంత్రణ కోసం నిరంతరం పనిచేస్తోందని చెప్పారు. అనంతరం సంతోష్ కుమార్ విద్యార్థులు, యువతతో కలిసి డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణ ప్రతిజ్ఞ చేయించారు.డ్రగ్స్ నియంత్రణ కోసము పోలీస్ కళాబృందం చేసిన నాటిక విద్యార్థులను ఎంతో ఆకట్టుకున్నది.2కె రన్ కార్యక్రమము పోలీస్ కమిషనర్ గారు జెండా ఊపి ప్రారంభించిన అనంతరం జిల్లా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నుండి ప్రారంభమై - రైల్వే కమాన్ - పోలీస్ పరేడ్ గ్రౌండ్ - ఎన్టీఆర్ చౌరస్తా - ఆర్ అండ్ బి ఆఫీస్ - రైల్వే స్టేషన్ - జిల్లా ఫైర్ స్టేషన్ - పాత కలెక్టరేట్ గ్రౌండ్ వరకు నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ(అడ్మిన్) ఎన్. శుభం ప్రకాష్ , జిల్లా ఇన్కమ్ టాక్స్ ఆఫీసర్ ఐశ్వర్య , ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ విశాల్ , నిజామాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ మెంబర్లు దర్శన్ సింగ్ , శిరీష్ కుమార్ , హితేన్ బిమాని , రజనీకాంత్ , శ్రీనివాస్ రెడ్డి , డి వై ఎస్ ఓ పవన్ కుమార్ , ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ , సీఐలు , ఎస్. ఐ లు పోలీసు సిబ్బంది , పోలీస్ కళాబృందం , నవ్య భారతి గ్లోబల్ పాఠశాల విద్యార్థులు , మెడికల్ కాలేజ్ విద్యార్థులు ,ఎన్సిసి క్యాండిడేట్స్ వివిధ కళాశాల పాఠశాలల విద్యార్థులు , ప్రతినిధులు , విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# ఇక్కడ ఫ్లై ఓవర్లు... అక్కడ ఎయిర్ పోర్టులు

హైదరాబాద్ జూన్ 26, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన జరిగి 12 ఏళ్లు గడిచింది. ఒకే రాష్ట్ర తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌గా విడిపోయాయి. విభజన తర్వాత తెలంగాణలో కరెంటు ఉండదని, నక్సలిజం పెరుగుతుందని అప్పట్లో కొందరు నేతలు వ్యాఖ్యానించారు. మరో బిహార్ అవుతుందని హెచ్చరించారు. అయితే ఇందుకు విరుద్ధంగా రాష్ట్ర విభజన తర్వాత రెండు రాష్ట్రాల్లో అభివృద్ధి వేగం పుంజుకుంది. వేర్వేరు ప్రాధాన్యతలతో అభివృద్ధి పనులు చేపట్టాయి. ఒక్కొక్క రాష్ట్రం తన ప్రధాన సమస్యలను దృష్టిలో పెట్టుకుని మౌలిక సదుపాయాలను నిర్మించుకుంది. ఇది రెండు రాష్ట్రాల మధ్య స్పష్టమైన వ్యత్యాసాన్ని సృష్టించింది.హైదరాబాద్‌లో ఫ్లై ఓవర్లు?తెలంగాణ రాష్ట్రం ఏర్పడినత ర్వాత అధికారం చేపట్టిన కేసీఆర్ హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడంపై ఎక్కువ దృష్టి పెట్టారు. రాష్ట్ర విభజన తర్వాత దాదాపు ఒక దశాబ్దంలో హైదరాబాద్‌లోనే 35కిపైగా ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు, సబ్‌వేలు నిర్మించడం ద్వారా ట్రాఫిక్ ప్రవాహాన్ని మెరుగుపరచింది. ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం, రోడ్ల విస్తరణ, చెరువుల సుందరీకరణ వంటి పనులు కూడా చేపట్టింది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా ఈ క్రమాన్ని కొనసాగిస్తూ మరిన్ని ఫ్లై ఓవర్లను ప్రారంభించింది.ఆంధ్రప్రదేశ్‌లో విమానాశ్రయాలు..ఇక ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర విభజన తర్వాత విమానాశ్రయాల అభివృద్ధిపై ఎక్కువ దృష్టి సారించింది. కర్నూల్, కడప, భోగాపురం వద్ద కొత్త అంతర్జాతీయ విమానాశ్రయాలు ఏర్పాటు చేయడం, అమరావతిలో మరో అంతర్జాతీయ విమానాశ్రయం, గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయాలకు సన్నాహాలు చేయడం ద్వారా రాష్ట్రంలో ఎయిర్ కనెక్టివిటీని మెరుగుపరచాలని ప్రయత్నిస్తోంది. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రయాణికులకు త్వరలో అందుబాటులోకి రానుంది.ఏపీలో నగరాభివృద్ధి లోపం..ఆంధ్రప్రదేశ్‌లో విశాఖపట్నం, విజయవాడ వంటి ప్రధాన నగరాల్లో ఫ్లై ఓవర్ల నిర్మాణం చాలా తక్కువగా ఉంది. మెట్రో ప్రాజెక్టులతో ఫ్లై ఓవర్లను ముడిపెట్టే ప్రతిపాదనలు కేంద్రం నుంచి ఆమోదం పొందలేకపోవడం ఒక కారణం. రాజధాని అమరావతి నిర్మాణంపై ఎక్కువ దృష్టి పెట్టడం వల్ల మిగిలిన జిల్లాలు, నగరాల్లో ఫ్లై ఓవర్లు, రోడ్ల విస్తరణ పనులు వెనకబడ్డాయి. అలాగే నగరాల్లో పచ్చదనం పెంచడంలో కూడా తెలంగాణతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్ వెనుకబడి ఉంది.రెండు రాష్ట్రాల ప్రాధాన్యతలుతెలంగాణ ప్రభుత్వం పట్టణీకరణ వల్ల ఏర్పడిన ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించడానికి ఫ్లై ఓవర్లు, రోడ్ల అభివృద్ధిని ప్రాధాన్యతగా తీసుకుంది.

అయితే కొత్త విమానాశ్రయాల ఏర్పాటులో వెనుకబడింది. వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాలకు ఆమోదం వచ్చినా నిర్మాణం ఇంకా ప్రారంభం కాలేదు. ఆంధ్రప్రదేశ్ మాత్రం రాష్ట్ర విభజన తర్వాత కనెక్టివిటీ, ఆర్థిక వృద్ధిని దృష్టిలో పెట్టుకుని విమానాశ్రయాలు, హైవేల నిర్మాణంపై ఎక్కువ దృష్టి పెట్టింది. కానీ నగరాల్లో ట్రాఫిక్ సౌకర్యాలు, ఫ్లై ఓవర్ల నిర్మాణంలో ఇంకా చాలా దూరం వెళ్లాల్సి ఉంది.ప్రస్తుతం తెలంగాణకు కొత్త విమానాశ్రయాలు అవసరం ఉంది. మరోవైపు ఆంధ్రప్రదేశ్‌కు నగరాల్లో ఫ్లై ఓవర్లు, రోడ్ల విస్తరణ, పచ్చదనం పెంచడం అత్యవసరం. రెండు రాష్ట్రాలు తమ బలహీనతలను గుర్తించి, ఒకరి నుంచి ఒకరు నేర్చుకుంటూ సమతుల్య అభివృద్ధిని సాధించాల్సిన అవసరం ఉంది.

# వరంగల్ లో ఇసుక దుమారం



వరంగల్ జూన్ 26, (న్యూస్ పల్స్)వరంగల్ జిల్లా పాలిటిక్స్‌లో ఇప్పుడు ఇసుక దుమారం రేగుతోంది. ఇసుక దందాతో ఇద్దరు మంత్రులు వేల కోట్లు దోచుకుంటున్నారని ఆరోపిస్తూ అధికార పక్షాన్ని ఇరుకున పెట్టే ప్రయత్నంలో ఉంది బీఆర్ఎస్. ములుగు జిల్లాలో ఎప్పుడూ లేనివిధంగా ఇసుక దోపిడీ జరుగుతోందని విపక్షం చేస్తున్న ఆరోపణలు పొలిటికల్ మంటలు పుట్టిస్తున్నాయి. దోపిడీకి సంబంధించి మా దగ్గర డ్రోన్ విజువల్స్, ఇతర ఆధారాలు ఉన్నాయంటూరోజుకో ప్రెస్ మీట్ పెట్టి హడావిడి చేస్తున్నారు గులాబీ నేతలు. అలాగే? దీనికి సంబంధించి సోషల్ మీడియాలో విపరీతమైన ప్రచారం జరుగుతోంది. ఇలాంటి సందర్భంలో దీనికి కౌంటర్ ఇవ్వడంలో జిల్లా కాంగ్రెస్ నేతలు విఫలమవుతున్నారన్న గుసగుసలు సైతం వినిపిస్తున్నాయి. ఇద్దరు మంత్రులు అంటూ? బీఆర్ఎస్ చేస్తున్న ప్రచారంపై కేవలం ములుగు జిల్లా పార్టీ నేతలు మినహా? కాస్తంత హోదా ఉన్న, పెద్ద నాయకులు ఎవరూ ఎందుకు రియాక్ట్ అవడం లేదన్న చర్చలు హాట్‌హాట్‌గా నడుస్తున్నాయి. రాష్ట్ర మంత్రులు ఇద్దరు కలిసి ములుగు జిల్లా పరిధిలోని గోదావరి ఇసుకను మింగేస్తున్నారంటూ డైరెక్ట్‌గా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. సీతమ్మ సాగర్‌లో అక్రమంగా ఇసుక తవ్వి దాదాపు 4 వేల కోట్ల రూపాయలు వెనకేసుకునేందుకు మంత్రులు ఇద్దరూ ప్రయత్నిస్తున్నారన్నది కేటీఆర్ ఆరోపణ. ఇసుక మాఫియా సూత్రధారులను బయటకు లాగాలన్నది ఆయన డిమాండ్.దీనికి సంబంధించి ములుగు కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశారు గులాబీ నేతలు. ఇలా ఇసుక దోపిడీ పేరుతో అధికార పక్షాన్ని ఇరుకునపెట్టేలా బీఆర్ఎస్ నేతలు రోజుకో కార్యక్రమం నిర్వహిస్తున్నా. అధికార పక్షం నుంచి గట్టిగా తిప్పికొట్టే ప్రయత్నం మాత్రం జరగడంలేదని సొంత పార్టీలోనే గుసగుసలు వినిపిస్తున్నాయి. కేవలం ములుగు నాయకులు, అందునా ఒక మంత్రి అనుచరగణం తప్ప? ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఏ ముఖ్య నేతా ఎందుకు స్పందించలేదన్నది పెద్ద ప్రశ్నగా మారింది. ఆ విషయంలో కాంగ్రెస్ వాళ్ళు ఎందుకు వెనకడుగు వేస్తున్నారంటూ ఎవరికి వారు రకరకాల విశ్లేషణల్లో మునిగిపోయారు. ములుగు జిల్లా డీసీసీ అధ్యక్షుడు అశోక్, జిల్లా పార్టీలోని కొందరు నాయకులు మాత్రమే బీఆర్ఎస్ ఆరోపణలకు రియాక్ట్ అయి నిరూపించమంటూ సవాల్ విసిరారు. మిగతా మంత్రులు, ఎమ్మెల్యేల సంగతి తర్వాత? కనీసం ఉమ్మడి వరంగల్ పరిధిలో ఇప్పుడున్న మిగిలిన ఐదు జిల్లాల డీసీసీ అధ్యక్షులు కూడా మినిస్టర్స్ మీద వస్తున్న ఇసుక ఆరోపణలపై ఎందుకు స్పందించడం లేదన్నది ఆలోచించాల్సిన విషయమేనని అంటున్నారు రాజకీయ పరిశీలకులు. ఇసుక తవ్వకాలకు సంబంధించిన అనుమతుల విషయంలో ఎక్కడా తప్పు జరగలేదని, మంత్రులు నిబంధనలకు విరుద్ధంగా ఎక్కడా వ్యవహరించలేదని కాంగ్రెస్ నేతలు గట్టిగా ఎందుకు చెప్పలేకపోతున్నారన్న ప్రశ్నలు సైతం వస్తున్నాయి.ఇందుకు సమాధానంగా వినిపిస్తున్న కొన్ని మాటలు కాంగ్రెస్ పార్టీలోని ప్రస్తుత పరిస్థితి ప్రతిబింబిస్తున్నాయని అంటున్నారు పొలిటికల్ పండిట్స్. ఏం మాట్లాడితే ఏమవుతుందోనన్న భయంతోనే ఎక్కువ మంది కామ్‌గా ఉన్నట్టు చెప్పుకుంటున్నారు. చేతిలో పూర్తి సమాచారం లేకుండా. ఏదో, మంత్రుల్ని వెనకేసుకుని రావాలి కాబట్టి నోటికొచ్చింది మాట్లాడేస్తే రేపు మనం ఇరుక్కుపోతామన్న భయం వాళ్ళలో ఉందట. అందుకే ఇసుక ఆరోపణల విషయంలో మంత్రులు ఇద్దరికీ బాసటగా నిలవలేకపోతున్నట్టు చెప్పుకుంటున్నారు. అలాగే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు మంత్రుల నుంచి కూడా మనం కరెక్ట్‌గానే ఉన్నాం, మీరు ఖండించండన్న గ్రీన్ సిగ్నల్ కూడా రాలేదని అంటున్నారు. ఇదే సమయంలో కాంగ్రెస్ అధిష్టానం సైతం ఈ విషయంపై నేతలకు క్లారిటీ ఇవ్వకపోవడం వల్ల ఇసుక దందా అంశాన్ని పట్టించుకోకుండా ఎవరికి వారు తమ పని తాము చేసుకుంటూ వెళ్తున్నారట.

## ఢిల్లీలో తెలంగాణకు స్థలం కరువు

హైదరాబాద్, జూన్ 26, (న్యూస్ పల్స్)దేశ రాజధానిలో తెలంగాణకు కేరాఫ్ లేకుండా పోతోందా? ప్రస్తుతం ఏపీ మంచితనం మీద ఆధారపడాల్సి వస్తోందా? వాళ్ళు ఎప్పుడు ఖాళీ చేయమంటారోనని తెలంగాణ అధికారులు కంగారు పడుతున్నారా? ఏ విషయంలో అంత టెన్షన్ పడుతున్నారు? రాష్ట్ర విభజన జరిగిన 12 ఏళ్ళ తర్వాత కూడా ఆ సమస్యలు ఎందుకు వస్తున్నాయి? ఢిల్లీలో తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీకకు నిర్మాణానికి అడ్డుపడుతున్నదేంటి? ఢిల్లీలో తెలుగోళ్ళకు కేరాఫ్ ఆంధ్ర భవన్. సెంట్రల్ ఢిల్లీలో అదీ, ఇండియా గేట్‌కు అత్యంత దగ్గరగా ఉన్న ఈ బిల్డింగ్ ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు ఓ వెలుగు వెలిగింది. అయితే విభజన తర్వాత ఆస్తుల పంపకాల్లో భాగంగా ఆంధ్ర భవన్ ను తాత్కాలికంగా విడగొట్టుకుని ఒకే బిల్డింగ్‌లో రెండు రాష్ట్రాలు అడ్మినిస్ట్రేషన్‌ను కొనసాగిస్తున్నాయి. అందుకే ప్రస్తుతం ఢిల్లీలోని ఈ భవన్‌ను చూస్తే గమ్మత్తుగా కనిపిస్తోందని అంటుంటారు చాలామంది. దీనికి ఒకవైపు ఆంధ్ర , మరో వైపు తెలంగాణ అని పక్క పక్కనే బోర్డ్స్ కనిపిస్తూ ఉంటాయి. పైగా రెండు రాష్ట్రాల ఢిల్లీ భవన్స్ ఒకే బిల్డింగ్‌లో ఉండడంతో వాళ్ళని వీళ్లు, వీళ్లని వాళ్ళు? మెయింటెనెన్స్‌ను పూర్తిగా గాలికొదిలేశారు. దాంతో ఘనంగా చెప్పుకోవాల్సిన ఆంధ్ర, తెలంగాణ భవన్లు ప్రస్తుతం గందరగోళంగా కనిపిస్తున్నాయి. రాష్ట్రంలో సెక్రటేరియెట్‌కు ఎంతటి ప్రాముఖ్యత ఉంటుందో, ఢిల్లీలో ఉండే రాష్ట్రాల భవన్లకు అంత ఇంపార్టెన్స్ ఉంటుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వారధిలా? ఢిల్లీలో రెసిడెంట్ కమిషనర్లు, ప్రోటో కాల్ అధికారులు ఉంటారు. ముఖ్యమంత్రి, చీఫ్ సెక్రటరీ, ఉన్నతాధికారులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు సైతం ఢిల్లీ ట్రిప్‌కు వచ్చినప్పుడు భవన్లోనే బస చేస్తూ ఉంటారు. ఈ క్రమంలో?. తెలంగాణలో కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చాక, భవన్ విభజనపై క్లారిటీ వచ్చింది, పంపకాలు జరిగాయి. ప్రస్తుతం ఉన్న బిల్డింగ్ మొత్తం ఆంధ్ర వాటా కింద వెళ్ళింది. ఆ ఒప్పందం ప్రకారం పటౌడీ హౌజ్‌లో ఉన్న ఖాళీ స్థలంలో తెలంగాణ భవన్ నిర్మాణం జరగాలి.కానీ? నిర్మాణం ఆలస్యం అవుతూ వస్తోంది. నిజం చెప్పాలంటే ప్రస్తుతం ఆంధ్ర భవన్‌లోనే తెలంగాణ భవన్ కొనసాగుతోంది. ఇది ఇలాగే ఉంటే ఏదో ఒకరోజున ఆంధ్ర వాళ్ళు ఖాళీ చేసి పొమ్మంటే మా పరిస్థితి ఏంటంటూ తెలంగాణ అధికారులు టెన్షన్ పడుతున్నారట. ఢిల్లీ భవన్ విభజన తర్వాత ఏపీకి 11.5 ఎకరాలు, తెలంగాణకు 8.2 ఎకరాలను కేటాయించారు, విభజన ప్రక్రియ మొత్తం కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో జరిగింది. ప్రస్తుతం ఢిల్లీలో తెలుగు రాష్ట్రాలకు ఉన్న స్థలం 19.7 ఎకరాలు. దాని విలువ 9వేల 913.505 కోట్లు ఉంటుంది. ఇది కూడా కేంద్ర హోంశాఖ చెప్పిన లెక్కే. వాస్తవానికి ఢిల్లీలో బహుళ అంతస్తుల నిర్మాణం కట్టాలంటే ప్రాసెస్ చాలా పెద్దది. మొదట ప్లాన్ రెడీ చేసి అనుమతులను కేంద్రం నుంచి తీసుకోవాల్సి ఉంటుంది. దాని ప్రకారం ఇప్పటికే ప్లాన్ సిద్ధం చేసుకున్న తెలంగాణ సర్కార్ నిధులు కేటాయించి.. నిర్మాణం కోసం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. కానీ? ఆ విషయంలో ఆలస్యం అవుతోంది. దాంతో? దేశ రాజధానిలో రాష్ట్రానికి కేరాఫ్‌గా నిలవాల్సిన భవనం లేకపోవడం ఇబ్బందిగా మారుతోంది. రాష్ట్రం నుంచి వచ్చే రాజకీయ నాయకులకు, అధికారులకు , సామాన్యులకు , టూరిస్టులకు కూడా ఇబ్బంది కలుగుతోంది.. మరోపక్క ఏపీ ప్రభుత్వం మాత్రం తన వాటాలోని 11.5 ఎకరాల్లో రూ.124.5 కోట్లతో కొత్త ఏపీ భవన్ నిర్మాణానికి సిద్ధమవుతోంది. అందుకోసం ఏపీ కేబినెట్ పచ్చజెండా ఊపింది కూడా. వాళ్ళు వెళ్ళిపొమ్మని ఖాళీ చేయించే పరిస్థితి రాకముందే తెలంగాణ భవన్‌కు పునాదులు వెయ్యాలని కోరుకుంటున్నారు ఇక్కడి అధికారులు.

## రెండు బైకులు ఢీ.. ఇద్దరు మృతి

హైదరాబాద్,గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 07:25 గంటలకు, ఏఎంబీ ఫ్లైఓవర్పై రోడ్డు ప్రమాదం జరిగింది. గచ్చిబౌలి నుండి హఫీజ్పేట్ వైపు వెళ్తున్న రాయల్ ఎన్ఫీల్డ్ మోటార్సైకిల్ హఫీజ్పేట్ నుండి గచ్చిబౌలి వైపు రోడ్ రాంగ్ రూట్ లో ప్రయాణిస్తున్న స్కూటీని ఎదురుగా ఢీకొట్టింది. స్కూటీ నడుపుతున్న శ్రీకాంత్, వెనుక కూర్చున్న విట్టల్ రోడ్డుపై పడి అక్కడికక్కడే మరణించారు. రాయల్ ఎన్ఫీల్డ్ రైడర్ వినోద్కు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులకు సమాచారం మేరకు సమీపంలో ఉన్న హాస్పిటల్ తరలించారు కేసు నమోదు చేసుకొని పూర్తి వివరాలు సేకరిస్తున్నమని తెలిపారు

# సైబర్ టవర్స్ ఇక చరిత్రే

హైదరాబాద్ జూన్ 26, (న్యూస్ పల్స్)హైదరాబాద్ నగర ఐటీ రంగానికి పునాది వేసిన మొట్టమొదటి ఐటీ టవర్ ఇంటర్‌గ్రాఫ్ కన్సల్టింగ్ భవనం చరిత్రగా మారిపోనుంది. అమెరికాకు చెందిన ఈ బహుళజాతి సంస్థ 1987లో బేగంపేట కేంద్రంగా నగరంలోనే మొదటి ఐటీ కార్యకలాపాలను ప్రారంభించింది. అయితే.. ఇటీవల ఈ భవనంలోని భూగర్భ నీటి సంపు దెబ్బతినడంతో భవన భద్రత దృష్ట్యా యాజమాన్యం దీన్ని పూర్తిగా కూల్చివేస్తోంది. ఒకప్పటి ఐటీ వైభవానికి ప్రతీకగా నిలిచిన ఈ ఐకానిక్ భవనం స్థానంలో సరికొత్త కమర్షియల్ బిల్డింగ్ నిర్మించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.నేటి తరం యువతకు ఐటీ కారిడార్, హైటెక్‌సిటీ అనగానే అందరికీ గుర్తొచ్చే ఏరియాలు మాదాపూర్, గచిబౌలి, నానక్‌రామ్‌గూడ, రాయదుర్గం. ఎటు చూసినా ఆకాశాన్ని తాకే గగనతలాలు, అత్యాధునిక గ్లాస్ బిల్డింగులే నేటి ఐటీ నగర రూపురేఖలు. కానీ.. హైదరాబాద్ నగరానికి చెందిన మొదటి తరం ఐటీ ఉద్యోగులను, అనుభవజ్ఞులను అడిగితే వారికి మొదటగా గుర్తొచ్చే ప్రాంతం బేగంపేట. ఎందుకంటే భాగ్యనగరంలో ఐటీ సామ్రాజ్యానికి తొలి పునాది పడింది ఇక్కడే. నగరంలోనే నిర్మితమైన మొట్టమొదటి ఐటీ టవర్‌గా ఖ్యాతిగాంచిన ఇంటర్‌గ్రాఫ్ కన్సల్టింగ్ భవనం పూర్తిగా కాలగర్భంలో కలిసిపోతోంది. ఆ ఐటీ భవన సముదాయాన్ని కూల్చివేసేందుకు యాజమాన్యం రెడీ అయింది.అమెరికాకు చెందిన ప్రముఖ సాంకేతిక సంస్థ ఇంటర్‌గ్రాఫ్ కన్సల్టింగ్ 1987లో బేగంపేటలో ఐటీ టవర్ నిర్మించింది. నగరంలో స్థాపించబడిన మొట్టమొదటి అంతర్జాతీయ బహుళజాతి సంస్థ ఇదే కావడం విశేషం. ఐటీ రంగంలో హైదరాబాద్ పేరు గ్లోబల్ మ్యాప్‌పైకి ఎక్కడానికి ఈ సంస్థే తొలి కారణం. దశాబ్దాల పాటు ఎంతోమంది సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లను తయారుచేసిన ఈ ఐకానిక్ భవనం ఇప్పుడు శాశ్వతంగా కనుమరుగవుతోంది. భవన భూగర్భంలో ఉన్న నీటి సంపు దెబ్బతినడం, పునాదులు బలహీనపడటంతో భవన భద్రతను దృష్టిలో ఉంచుకుని దానిని కూల్చివేయాలని యాజమాన్యం నిర్ణయించింది. ఈ మేరకు కూల్చివేత పనులు జరుగుతున్నట్లు స్థానిక పోలీసులు ధృవీకరించారు. పాత భవనాన్ని పూర్తిగా తొలగించిన అనంతరం.. అదే స్థలంలో సరికొత్త అధునాతన కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మించే యోచనలో యాజమాన్యం ఉన్నట్లు తెలుస్తోంది.మాదాపూర్‌లో సైబర్ టవర్స్‌ను నిర్మించి.. విప్రో, ఇన్ఫోసిస్ వంటి దిగ్గజ దేశీయ ఐటీ సంస్థలకు పెద్ద ఎత్తున భూములు కేటాయించేంత వరకు నగర ఐటీ రంగానికి బేగంపేట, అమీర్‌పేట ప్రాంతాలే ప్రధాన కేంద్రాలుగా ఉన్నాయి. నగర నడిబొడ్డున బేగంపేట విమానాశ్రయం అందుబాటులో ఉండటం కూడా ఈ ప్రాంతం ఐటీ హబ్‌గా ఎదగడానికి ప్రధాన కారణమైంది. ఆ రోజుల్లో బ్రిగేడ్, టాటా సెర్విజోల్, విప్రో ఎయిర్‌టెల్, ఇంటర్‌గ్రాఫ్ వంటి దిగ్గజ సంస్థలన్నీ బేగంపేట కేంద్రంగానే తమ కార్యకలాపాలను సాగించాయి.వీటితో పాటు మేఫిర్, సిటీ సెంటర్ కాంప్లెక్స్‌లలో సత్యం కంప్యూటర్స్ సంస్థ తన కార్యకలాపాలను నడపగా.. పంజాగుట్టలో ఓఎస్ఐ, బంజారాహిల్స్ రోడ్ నంబర్ 10లో హెచ్‌ఎస్‌బీసీ, సియారా అట్లాంటిక్ సంస్థలు ఉండేవి. సోమాజిగూడ కేంద్రంగా ఏడీపీ, 24/7 కస్టమర్ వంటి అగ్రశ్రేణి కంపెనీలు నగరంలో ఐటీ విప్లవానికి ఊతమిచ్చాయి. నాడు కొన్ని వందల మందితో ప్రారంభమైన ఐటీ ఉద్యోగుల ప్రస్థానం..నేడులక్షలమందికిఉపాధి కల్పించే స్థాయికి చేరింది. ఎందరో మొదటి తరం సాఫ్ట్‌వేర్ నిపుణులకు ఉపాధినిచ్చి, జీవితాలను నిలబెట్టిన హైదరాబాద్ మొదటి ఐటీ టవర్ ఇంటర్‌గ్రాఫ్ భవనం నేడు జ్ఞాపకంగా మిగిలిపోతుండటంతో పాత తరం టెక్కీలు తీవ్ర భావోద్వేగానికి లోనవుతున్నారు.

# 10 రెస్టారెంట్లలో 9 దారుణం

హైదరాబాద్, జూన్ 26, (న్యూస్ పల్స్)జొమాటో లేదా స్విగ్గి.. ఉబర్.. ఇలా ఎన్నో ఉన్నాయి. జస్ట్ ఫోన్ ఆన్ చేయడం.. యాప్ ఓపెన్ చేయడం.. ఆఫర్లు చూడడం.. నచ్చిన ఆహారం సెలెక్ట్ చేయడం.. ఆర్డర్ పెట్టడం.. పేమెంట్ ఆన్లైన్లోనే చేసేయడం.. ఉదయం టిఫిన్.. మధ్యాహ్నం భోజనం.. సాయంత్రం డిన్నర్.. మధ్యలో స్నాక్స్.. చివరికి కేకులు.. బర్గర్లు.. పిజ్జాలు.. సూప్ లు కూడా అందులోనే.. ఆర్డర్ పెట్టిన కొత్త సమయానికి కళ్ళ ముందుకు వస్తుంది. కాళ్ల దగ్గరికి వస్తుంది. అలాంటప్పుడు ఇలాంటి తిండిని ఎవరు కాదనుకుంటారు..కొంతకాలంగా హైదరాబాదులో సగటు నగర జీవి ఇటువంటి రెడీమేడ్ ఫుడ్ కే అలవాటు పడ్డాడు. చివరికి వివాహం జరిగిన వారు సైతం ఆన్లైన్లోనే ఆర్డర్ పెట్టుకుంటున్నారు. వండే శ్రమ లేకుండా.. చెమటలు చిందించకుండా దర్జాగా తింటున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ.. తెస్తున్న ఫుడ్ ఎలా ఉంటుంది.. ఎలాంటి పరిస్థితుల్లో తయారుచేస్తున్నారు.. వాటి వల్ల ఎలాంటి రోగాలు వస్తాయి ఎవరూ గుర్తించడం లేదు. చివరికి ఆఫీసర్లు చేసిన దాడుల్లో.. దిగ్భ్రాంతి కరమైన వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి.హైదరాబాద్ నగరంలో ఈ నెలలో 10 రెస్టారెంట్లను అధికారులు తనిఖీలు చేస్తే.. అందులో తొమ్మిది అత్యంత దారుణంగా ఉన్నాయని తేలింది. చెత్తబుట్టలో వేయాల్సిన ఆహారాన్ని వారు విక్రయిస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. దారుణమైన ఆహారాన్ని రకరకాల రంగులు.. మసాలాలు దట్టించి ప్లేట్లో పెడుతున్నారు. అంతేరా..ఈ రెస్టారెంట్ మదినగూడ లో ఉంది. ఇక్కడ కూరగాయలకు బూజు పట్టి ఉంది. వాడిన నూనె మళ్ళీ మళ్ళీ ఉపయోగించడానికి అధికారులు గుర్తించారు. పైగా ప్యాకెట్ల మీద లేబుల్స్ కూడా లేవు.

లులు హైపర్ మార్కెట్

చెత్తబుట్టలో వేయాల్సిన 150 కిలోల ఆహారాన్ని ఇక్కడ అధికారులు గుర్తించారు. వెంటనే దానిని స్వాధీనం చేసుకున్నారు. డ్రైనేజీలు మొత్తం



బ్లాక్ అయ్యాయి. అందులో పురుగులు ఉన్నాయి. గడువు ముగిసిన ఆహార పదార్థాలను గుర్తించిన అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

ఉడిపి ఉపహార్ మూసాపేట్

డ్రైనేజీలో దారుణంగా సమస్యలు ఉన్నాయి. పురుగులు ఎక్కడికక్కడ కనిపిస్తున్నాయి. చెత్తబుట్టల మీద మూతలు లేవు. వంట చేసేవారు సరైన జాగ్రత్తలు పాటించడం లేదు. లైసెన్స్ కూడా ముగిసిపోయింది.

చౌమన్, మాదాపూర్

ఇక్కడ మాంసాన్ని అత్యంత అపరిశుభ్రమైన వాతావరణంలో నిల్వ చేశారు. శాకాహారం.. మాంసాహారం కలిపి నిల్వ చేశారు. కనీసం వాటి మీద మూతలు కూడా పెట్టలేదు.

జిస్మత్ జైల్ మండి, మదినగూడ

ఇక్కడ వంటలు వండే తీరు ఎలా ఉందంటే.. కనీసం వాటిని పందులు కూడా తినవు. ఐటమ్స్కు లేబుల్స్ లేవు. సరైన నిలవలేదు. దీనికి ఎటువంటి గుర్తింపు లేదు. వాతావరణం అత్యంత దారుణంగా ఉంది.

రాయల్ స్పైసి, గచ్చిబౌలి

కీటకాలు తాండవం చేస్తున్నాయి. దుర్వాసన ముక్కులను పగలగొడుతోంది. నీరు దారుణంగా నిలిచిపోయింది. కిచెన్ అత్యంత అపరిశుభ్రంగా ఉంది. వంట కాదు కదా, ఇక్కడ ఐదు నిమిషాలు కూడా ఉండలేని పరిస్థితి.

సబ్ వే, కొండాపూర్

కుళ్ళిపోయిన కూరగాయలు వాడుతున్నారు. లేబుల్ లేని ఐటమ్స్ ఉపయోగిస్తున్నారు. సింక్ నిర్వహణ అత్యంత దారుణంగా ఉంది. ఆహార వృధా గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు.

లాఫినోస్ పిజ్జా, జూబ్లీ ఎంక్లేవ్

బొద్దింకలు స్వైర విహారం చేస్తున్నాయి. ఇతర రెక్కల పురుగులు ఇష్టమొచ్చినట్టు తిరుగుతున్నాయి. గడువు ముగిసిన ఆహార పదార్థాలు ఉపయోగిస్తున్నారు. అపరిశుభ్రత అత్యంత దారుణంగా ఉంది.

## తెలంగాణ రైతులకు శుభవార్త
## ఒకేసారి 'రైతుభరోసా' నిధులు రిలీజ్

హైదరాబాద్ ,తెలంగాణలో వానాకాలం సీజన్‌కు సంబంధించి రైతుభరోసా పెట్టుబడి సాయాన్ని ఈసారి రైతుల ఖాతాల్లో ఒకేసారి జమ చేయనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు.ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాథపురంలో ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. మధిర నియోజకవర్గ పరిధిలోని చింతకాని మండలంలో ఈ నెల 30న నిర్వహించనున్న 'రైతు ఆశీర్వాద సభ'లో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఈ నిధులను విడుదల చేయనున్నట్లు స్పష్టం చేశారు. ఇందుకోసం ప్రభుత్వం అధికారికంగా మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ పథకం కింద ఎకరాకు రూ. 6 వేల చొప్పున, రెండు సీజన్లలో కలిపి మొత్తం రూ. 12 వేల పెట్టుబడి సాయాన్ని ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేయనుంది.ఈ వానాకాలం సీజన్‌లో రైతుభరోసా లబ్ధి పొందడానికి ప్రభుత్వం కీలక విధివిధానాలను ఖరారు చేసింది. ఈ నెల 15వ తేదీ నాటికి 'భూభారతి' పోర్టల్‌లో భూమి వివరాలు నమోదై, ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ సీసీఎల్ఏ నుంచి అనుమతులు పొందిన రైతులకు మాత్రమే ఈ సాయం అందుతుంది. అలాగే, ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు కలిగిన గిరిజన రైతులు కూడా ట్రైబల్ వెల్ఫేర్ కమిషనర్ నుంచి అనుమతులు పొంది ఉండాలి. అర్హులైన రైతుల రికార్డులను ఈ నెల 30వ తేదీ నాటికి పూర్తి స్థాయిలో సిద్ధం చేయాలని జిల్లా వ్యవసాయాధికారులను ప్రభుత్వం ఆదేశించింది. ఒక జిల్లా పరిధిలోనే దాదాపు 3.58 లక్షల మంది రైతులు లబ్ధిదారులుగా ఉండగా, వారి కోసం రూ. 460 కోట్ల నిధులు అవసరమని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ జాబితాలో కొత్తగా పాస్ పుస్తకాలు పొందిన 3,906 మంది రైతులు కూడా ఉన్నారు.

## గోల్డ్ మ్యాన్' సూర్య అరెస్ట్

హైదరాబాద్, సీఎం, పోలీస్ కమిషనర్లకు తాను అత్యంత సన్నిహితుడినని నమ్మించి, విదేశాల నుండి తక్కువ ధరకే బంగారం ఇప్పిస్తానంటూ ప్రజలను మోసం చేసిన 'గోల్డ్ మ్యాన్' సూర్యను అత్తాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. బాధితుల ఫిర్యాదుతో నిందితుడిని అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ప్రజలు ఇలాంటి మోసగాళ్ల మాటలు నమ్మి మోసపోవద్దని, అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరించారు.

## ప్రైవేట్ కాలేజీల యజమాన్యాలకు ఊరట

హైదరాబాద్, జూన్ 26, (న్యూస్ పల్స్) తెలంగాణ హైకోర్టులో ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలకు స్వల్ప ఊరట లభించింది. విద్యార్థుల నుంచి ఫీజుల వసూళ్లు, ఫీజు రియింబర్స్‌మెంట్‌కు సంబంధించి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీవో నంబర్ 9 లోని మార్గదర్శకాలపై హైకోర్టు స్టే విధిస్తూ.. మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయకపోవడంతోపాటు.. విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయవద్దంటూ సర్కార్ తీసుకొచ్చిన జీవో 9పై ధర్మాసనం తీవ్రంగా మండిపడింది. వచ్చే మంగళవారం వరకు ఎలాంటి చర్యలు తీసుకోవద్దని స్టే విధిస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.జీవో నంబర్ 9ని సవాల్ చేస్తూ ప్రైవేటు కాలేజీలు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన తెలంగాణ హైకోర్టు .. రాష్ట్ర ప్రభుత్వానికి పలు ప్రశ్నలు సంధించింది. ప్రభుత్వం బకాయిలు చెల్లించకుండా.. విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయవద్దంటే యాజమాన్యాలు ప్రైవేటు కాలేజీలను ఎలా నడుపుతారని నిలదీసింది. అదే సమయంలో రాష్ట్రంలో విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ఎంత బడ్జెట్ కేటాయించారని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. బడ్జెట్ సమావేశాలు కూడా అయిపోయాయని.. ఇంకా పెండింగ్ ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలను ఎందుకు విడుదల చేయలేదని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.కోట్ల ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు ఆగిపోవడంతో కాలేజీలను నడపడం కష్టంగా మారిందని.. ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బందికి వేతనాలు చెల్లించడం కూడా కాలేజీలకు భారంగా మారిందని హైకోర్టు పేర్కొంది.ఈ క్రమంలోనే ప్రైవేటు కాలేజీలకు ఫీజు రీయంబర్స్‌మెంట్ కింద చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలను ఎప్పటి లోగా చెల్లిస్తారో చెప్పాలని హైకోర్టు ఆదేశించింది. ఈ ఏడాది ఆగస్ట్ 15వ తేదీ లోపు అన్ని బకాయిలను క్లియర్ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం తరపు వాదనలు వినిపించిన లాయర్ హైకోర్టుకు తెలిపారు. దీనిపై స్పందించిన ప్రైవేటు కాలేజీల తరపు వాదనలు వినిపిస్తున్న లాయర్.. ఆగస్టు 15వ తేదీ లోపు బకాయిలు మొత్తం క్లియర్ చేస్తే.. ఆరోజే తాము దాఖలు చేసిన పిటిషన్లను వెనక్కి తీసుకుంటామని హైకోర్టుకు విన్నవించారు.ఇక ఈ వ్యవహారంలో పలువురు విద్యార్థులు కూడా ఇంప్లీడ్ పిటిషన్లు దాఖలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి, ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలకు మధ్య విద్యార్థులు తీవ్రంగా నలిగిపోతున్నారని విద్యార్థుల తరపు న్యాయవాది హైకోర్టుకు తెలిపారు. ఈ పెండింగ్ బకాయిల ద్వారా విద్యార్థులు నష్టపోకుండా చూడాలని కోర్టును కోరారు. ఈ ఏడాది కొత్తగా కాలేజీల్లో చేరే విద్యార్థులకే ఇది వర్తించేలా చూడాలని.. విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్లపై తదుపరి విచారణను హైకోర్టు మంగళవారానికి(జూన్ 30) వాయిదా వేసింది.

## వికారాబాద్‌లో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా 2కే రన్ నిర్వహణ

వికారాబాద్ జిల్లా ,వికారాబాద్ జిల్లా కేంద్రంలోని బ్లాక్ గ్రౌండ్‌లో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన 2కే రన్ కార్యక్రమాన్ని శాసన సభా పతి గడ్డం ప్రసాద్ కుమార్ జెండా ఊపి ప్రారంబించారు.ఈ కార్యక్రమంలో స్పీకర్ ప్రసాద్ కుమార్, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీతో పాటు మున్సిపల్ చైర్మన్ మరియు వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని 2కే రన్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వ్యసనం వ్యక్తి ఆరోగ్యాన్ని, కుటుంబాన్ని, సమాజాన్ని తీవ్రంగా దెబ్బతీస్తుందని అన్నారు. యువత ఆరోగ్యంగా, క్రమశిక్షణతో జీవిస్తూ దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, ప్రభుత్వం, పోలీసు శాఖతో పాటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజంలోని ప్రతి ఒక్కరూ యువతకు సరైన మార్గనిర్దేశం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, విద్యార్థులు, సామాజిక కార్యకర్తలు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొని మాదకద్రవ్యాల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమం ద్వారా డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని యువతకు పిలుపునిచ్చారు.

## అంత్యోదయ పథకంలో మార్పులు

వరంగల్ జూన్ 26, (న్యూస్ పల్స్)దేశంలోని అత్యంత నిరుపేద కుటుంబాల ఆహార భద్రత కోసం కేంద్ర ప్రభుత్వం అంత్యోదయ అన్న యోజన పథకాన్ని తీసుకొచ్చింది. ఈ పథకం కింద ఒక్కో కుటుంబానికి 35 కిలోల బియ్యం లేదా గోధుమలను అందిస్తున్నారు. తాజాగా, ఈ పథకంలో మార్పులు చేపట్టాలని కేంద్రం నిర్ణయించింది. ఇకపై పేద కుటుంబాల్లోని సభ్యుల సంఖ్యను బట్టి రేషన్ పంపిణీ చేయనున్నారు. ఈ కార్డు ఉన్నవారికి ఒక్కొక్కరికీ 7 కిలోలు చొప్పున ఇద్దరు ఉంటే 14 కిలోల ఇస్తారు. ఐదుగురు, ఆపై ఎక్కువ ఉంటే ప్రస్తుతం ఇచ్చే 35 కిలోలు కొనసాగుతాయి.అంత్యోదయ అన్న యోజన పథకంలో కేంద్రం కీలక మార్పులు తీసుకురానుంది. ఈ పథకం కింద లబ్దిదారులకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ఒక్కొక్కరికీ 7 కిలోల ఆహారధాన్యాలు అందజేసేలా మార్పులు చేయబోతోంది. ప్రస్తుతం ఉన్న 35 కిలోల గరిష్ఠ పరిమితిని యథాతథంగా కొనసాగించాలని భావిస్తోంది. ఇందుకు సంబంధించి జాతీయ ఆహార భద్రత చట్టం 2013ను సవరించేందుకు సిద్ధమైంది. ఇందుకు సంబంధించిన సవరణ బిల్లుపై ప్రజాభిప్రాయ సేకరణకు నోటిఫికేషన్ జారీచేసిన కేంద్ర ఆహార మంత్రిత్వ శాఖ.. జులై 13 వరకు గడువు విధించింది.ప్రస్తుతం అత్యంత నిరుపేద కుటుంబాలకు అంత్యోదయ అన్న యోజన పథకం కింద సభ్యుల సంఖ్యతో సంబంధం లేకుండా 35 కిలోల చొప్పున ఆహార ధాన్యాలను ఉచితంగా ఇస్తున్నారు. అదే, సాధారణ రేషన్‌కార్డుదారులకు ఒక్కో వ్యక్తికి నెలకు 5 కిలోల చొప్పున అందిస్తున్నారు. కానీ, మార్పుల తర్వాత అంత్యోదయ కార్డుదారులు కుటుంబంలో ఇద్దరే ఉంటే వారికి 14 కిలోలు ఆహారధాన్యాలు మాత్రమే లభిస్తాయి. ఐదుగురు లేదా అంతకు మించి ఉన్నా 35 కిలోలు పంపిణీ చేస్తారు. జాతీయ ఆహార భద్రత చట్టం ప్రకారం ప్రతి ఒక్కరికీ తగిన పరిమాణంలో ఆహారధాన్యాలను అందజేయడమే ఈ సవరణ ఉద్దేశమని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.ప్రస్తుత విధానం వల్ల ఎక్కువ మంది అంత్యోదయ అన్న యోజన కుటుంబాలు, సాధారణ రేషన్‌కార్డు కేటగిరీ కంటే తలసరి తక్కువ రేషన్‌ను పొందుతున్నాయి. వాస్తవానికి ప్రయారిటీ హౌస్‌హోల్డ్ కేటగిరీ అనేది అంత్యోదయ లబ్ధిదారుల కంటే తక్కువ నిరుపేదలుగా ఉన్నవారి కోసం ఉద్దేశించబడింది"అంత్యోదయ అన్న యోజన కింద ప్రస్తుతం ఉన్న 'కుటుంబ ఆధారిత రేషన్ విధానం' అత్యంత నిరుపేద కుటుంబాలను ఆదుకోవాలనే ఉద్దేశంతో తెచ్చినప్పటికీ, ఇది కుటుంబ పరిమాణాన్ని బట్టి లబ్ధిదారుల మధ్య తీవ్ర అసమానతలకు దారితీస్తోంది" అని మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. చిన్న కుటుంబాలకు వచ్చే రేషన్ పరిమాణంలో పెద్దగా మార్పు ఉండకపోవచ్చు. కానీ పెద్ద కుటుంబాల సభ్యుల సంఖ్యకు అనుగుణంగా రేషన్ కేటాయింపులు పెరుగుతాయి కాబట్టి వారు దీని వల్ల లబ్ధి పొందుతారు.జాతీయ ఆహార భద్రతా చట్టం, 2013 లక్ష్యాలకు అనుగుణంగా సరసమైన ధరలకు నాణ్యమైన ఆహారాన్ని తగినంత పరిమాణంలో అందించడం ద్వారా ఆహార, పోషకాహార భద్రతను బలోపేతం చేయడానికి ప్రభుత్వం చేపడుతున్న విస్తృత విధానంలో భాగంగానే ఈ సవరణను తీసుకువచ్చినట్లు ప్రభుత్వం పేర్కొంది. ప్రస్తుతం, ప్రయారిటీ హౌస్‌హోల్డ్స్, అంత్యోదయ అన్న యోజన లబ్ధిదారులిద్దరికీ బియ్యం లేదా గోధుమలను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు.

## పంచముఖ సంకటహార మహాగణపతి రూపంలో..

హైదరాబాద్, జూన్ 26, (న్యూస్ పల్స్)ఈ ఏడాది ఖైరతాబాద్ బడా గణపతి 69 అడుగుల ఎత్తులో రూపొందించనున్నారు. పంచముఖ సంకటహార మహాగణపతి రూపంలో ఖైరతాబాద్ మహా గణేషుడు భక్తులకు దర్శనం ఇవ్వనున్నాడు. ఇక ఆ విగ్రహానికి ఒకవైపు సోమనాథ్ జ్యోతిర్లింగం.. మరోవైపు కాళీమాత విగ్రహాలు ఏర్పాటు చేయనున్నారు. ఈసారితో ఖైరతాబాద్ ఉత్సవాలకు 72 ఏళ్లు పూర్తి కానున్నాయి. సెప్టెంబర్ 14న వినాయక చవితి జరగనుండగా.. తాజాగా కర్ర పూజా కార్యక్రమాలు జరిగాయి. ప్రసిద్ధి చెందిన వినాయక మండపాల్లో ఒకటైన హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ మహా గణేశుడి ఉత్సవాలు నేటితో అంగరంగ వైభవంగా ప్రారంభం అయ్యాయి. తాజాగా ఈసారి ఖైరతాబాద్‌లో ప్రతిష్ఠించే మహా గణపతి నమూనా పోస్టర్‌ను ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ సమితి ఇవాళ ఆవిష్కరించింది. ఈ క్రమంలోనే ఘనంగా కర్రపూజను నిర్వహించింది. ఈసారి 69 అడుగుల ఎత్తైన విగ్రహాన్ని.. పంచముఖ సంకటహార మహా గణపతి రూపంలో తయారు చేయనున్నారు. ఈ విగ్రహ నిర్మాణం పూర్తి కావడానికి 82 రోజులు పట్టనుంది. ఈసారి ఖైరతాబాద్ బడా గణేష్ విగ్రహంలో సోమనాథ్ జ్యోతిర్లింగం, కాళికామాత ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.నిర్జల ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం రోజున ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ కమిటీ, శ్రీ గణేష్ ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో సాంప్రదాయబద్ధంగా కర్రపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దీంతో ఖైరతాబాద్ మహా గణపతి ఉత్సవాలకు అంకురార్పణ జరిగినట్లయింది. ఈ పూజా తర్వాత ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్.. ఈ ఏడాది అక్కడ కొలువుదీరనున్న వినాయకుడి నమూనా పోస్టర్‌ను అధికారికంగా విడుదల చేశారు.వినాయక చవితి ఈ ఏడాది సెప్టెంబర్ 14వ తేదీన రానుండగా.. నేటితో సరిగ్గా 82 రోజులు మిగిలి ఉన్నాయి. దీంతో ఈ 82 రోజుల్లోనే సర్వ హంగులతో కూడిన 69 అడుగుల భారీ మహా గణపతి విగ్రహాన్ని పూర్తి చేస్తామని.. ఉత్సవ కమిటీ సభ్యులు స్పష్టం చేశారు. ఇక ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న యుద్ధాలు.. ఉద్రిక్తతలు తగ్గిపోయి.. అన్ని దేశాల్లో శాంతి చేకూరాలనే సంకల్పంతో ఈసారి ఖైరతాబాద్ గణేశుడిని పంచముఖ సంకటహార మహా గణపతి రూపంలో ఏర్పాటు చేస్తున్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తేల్చి చెప్పారు.ఈ భారీ వినాయకుడి విగ్రహానికి కుడివైపున ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒకటైన సోమనాథ్ జ్యోతిర్లింగం రూపాన్ని ఏర్పాటు చేయనున్నారు. అదే సమయంలో ఎడమ వైపున భక్తులను ఎల్లవేళలా కాపాడే కాళికామాత విగ్రహాన్ని అద్భుతంగా తీర్చిదిద్దనున్నట్లు ఉత్సవ కమిటీ స్పష్టం చేసింది. లోక కల్యాణార్థం కొలువుదీరనున్న ఈ పంచముఖ గణపతి విశేష రూపం ఇప్పుడు భక్తులను విశేషంగా ఆకట్టుకోనుంది.

## ఫారెస్ట్ అధికారులను అడ్డుకున్న పోడు రైతులు

ఆసిఫాబాద్ ఆసిఫాబాద్ జిల్లాలో ఫారెస్ట్ అధికారులను పోడు రైతులు అడ్డుకున్నారు. మమ్మల్ని అరెస్ట్ చేసినా, చంపినా భూములను వదులుకోము అంటూ తెగేసి చెప్పారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలంలోని పులస గ్రామ శివారులో అటవీ భూమిని జేసీబీతో చదును చేసేందుకు వెళ్లిన ఫారెస్ట్ అధికారులను రైతులు అడ్డుకున్నారు.ఈ నేపథ్యంలో ఇరు వర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. మా తాతముత్తాతల నుంచి ఈ భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని హక్కు పత్రాలు సైతం ఉన్నాయని అన్నారు. కానీ ఇప్పుడు వచ్చి మా భూములు లాక్కుంటే మేము మా పిల్లలు ఎట్లా బతకాలని ఫారెస్ట్ అధికారులను నిలదీసారు. ఉన్న ఈ భూములను లాక్కుంటే ఉపాధి కోల్పోయి కుటుంబాలతో రోడ్డున పడుతామని ఆవేదన వ్యక్తం చేసారు.

## పెనగడప చెరువు షట్టర్ల మరమ్మతులపై ఇరిగేషన్ అధికారుల అలసత్వం



చుంచుపల్లి, జూన్ 26 : వర్షాకాలం ప్రారంభమైన వేళ చెరువుల్లో నీటిని నిల్వ చేసి రైతులకు సాగునీరు అందించాల్సిన సమయంలో చెరువుల తూముల షట్టర్లు పాడైపోయినా ఇరిగేషన్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెనగడపలోని కృష్ణారాయుడు చెరువు, ఎర్ర చెరువు, పెద్ద చెరువు కింద సుమారు 900 ఎకరాలకు పైగా ఆయకట్టు ఉంది. ఈ మూడు చెరువుల నుండే ప్రతి ఏడాది రెండు పంటలకు సాగునీరు అందుతుండడంతో పాటు భూగర్భ జలాలు కూడా సమృద్ధిగా నిల్వ ఉండి బోర్లు, మోటార్లకు నీరు లభిస్తుందని రైతులు చెబుతున్నారు. అయితే కొన్ని నెలలుగా ఈ మూడు చెరువుల తూముల షట్టర్లు పూర్తిగా దెబ్బతినడంతో చెరువుల్లో నీటిని నిల్వ చేయడం కష్టంగా మారిందని, వర్షపు నీరు వృథాగా పోతుందనే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు శాశ్వత చర్యలు చేపట్టలేదని రైతులు విమర్శిస్తున్నారు. ఈ విషయాన్ని ఇరిగేషన్ అధికారులు కూడా ధృవీకరించారు. షట్టర్ల మరమ్మతుల కోసం రూ.1.10 లక్షల అంచనా వ్యయంతో టెండర్లు పిలిచినా ఎవరూ ముందుకు రాలేదని అధికారులు పేర్కొంటున్నారు. దీంతో పనులు నిలిచిపోయాయని చెబుతున్నారు. అదే విధంగా ఇది సింగరేణి ప్రభావిత ప్రాంతం కావడంతో జీకేఓసీ (ఉఐ ూఅ) నుండి విడుదల చేసే నీటిని కూడా ఈ చెరువుల్లోకి మళ్లిస్తుంటారు. షట్టర్ల సమస్యపై సింగరేణి అధికారులు కూడా పలుమార్లు ప్రస్తావించినట్లు ఇరిగేషన్ ఏఈ ప్రసాద్‌రావు తెలిపారు. అయితే అధికారులు టెండర్ల పేరుతో కాలయాపన చేయకుండా ప్రత్యేక చర్యలు తీసుకుని తక్షణమే షట్టర్ల మరమ్మతులు పూర్తి చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్ శాఖ స్పందించి చెరువుల్లో నీరు నిల్వ ఉండేలా చర్యలు చేపట్టకపోతే రాబోయే సాగు సీజన్‌లో రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## తెలంగాణలో భారీగా ఐఏఎస్ అధికారుల బదిలీ




హైదరాబాద్ : రాష్ట్రంలో( మారోసారి పలువురు ఐఏఎస్ (ఎయా) అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కీలకమైన జిల్లాలు, వివిధ ప్రభుత్వ శాఖల పరిధిలో ఉన్నతాధికారుల మార్పులు జరిగాయి. ఈ నెలాఖరుతో చీఫ్ సెక్రటరీ కె.రామకృష్ణారావు పదవీ కాలం ముగియనుండటంతో అతడిని సీఎం రేవంత్ రెడ్డి సలహాదారుగా నియమించింది. సీఎంవో నుంచి అజిత్ రెడ్డికి ఉద్వాసన పలికి ఇన్వెస్ట్ తెలంగాణ సీఈవోగా బదిలీ చేసింది. ఎన్. శ్రీధర్‌కు ముఖ్యమంత్రి సెక్రటరీగా ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది. సభ్యసాచి ఘోష్‌కు హ్యాండ్లూమ్, టెక్స్‌టైల్స్ శాఖ అదనపు బాధ్యతలను అప్పగించిందిఅలాగే శైలజా రామయ్యర్‌ను అటవీశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా, అహ్మద్ నదీమ్‌కు పొలిటికల్(ఉంఆ) ప్రిన్సిపల్ సెక్రటరీగా పోస్టింగ్ ఇచ్చింది. రాహుల్ బొజ్జాకు ప్రకృతి విపత్తుల మేనేజ్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీగా, ఎం. రఘునందన్‌రావుకు మైన్స్ అండ్ జియాలజీ శాఖ అదనపు బాధ్యతలు అప్పగించింది. పి. కాత్యాయని దేవి హ్యాండ్లూమ్స్ హ్యాండీ క్రాఫ్ట్స్ స్పెషల్ సెక్రటరీగా పోస్టింగ్ ఇచ్చిన ప్రభుత్వం కె. గంగాధర్‌ను ఆర్అండ్‌బీ స్పెషల్ సెక్రటరీగా బదిలీ చేసింది. టి. వెంకన్న గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్‌గా, కె. విద్యాసాగర్‌ను టూరిజం డైరెక్టర్‌గా నియమిస్తూ ఉత్వర్వులు జారీ చేసింది.

## డంపింగ్ యార్డ్‌గా వల్లభరావు చెరువు కట్ట : దండంపల్లి సత్తయ్య

నీలగిరి, జూన్ 26 : నల్లగొండ పట్టణంలోని 17వ డివిజన్ పరిధిలో గల పద్మశాలి నగర్ దగ్గర ఉన్న వల్లభరావు చెరువు కట్ట వెంబడి చెత్తాచెదారం వేస్తూ డంపింగ్ యార్డ్ గా మారుతున్న పరిస్థితిని పరిశీలించి మున్సిపల్ అధికారులు వెంటనే శుభ్రం చేయించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం సిపిఎం 17, 35 డివిజన్ శాఖ ఆధ్వర్యంలో చెరువు కట్టను పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వం వల్లభరావు చెరువును బతుకమ్మ కుంటగా మార్చి పద్మశాలి నగర్ నుండి అద్దంకి బైపాస్ వరకు కట్ట నిర్మాణం ఆధునీకరించి, సిసి రోడ్డు, లైట్లు వేసి మినీ ట్యాంక్ బండ్ గా పట్టణ ప్రజలకు ఆహ్లాద వాతావరణాన్ని సృష్టించడానికి



తయారు చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం కట్టపై చెత్తాచెదారం వేస్తూ పాత బట్టలు, ఇల్లు కూల్చిన మట్టి తెచ్చి అక్కడ పోస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సాయంత్రం దోమల బెడదతో పద్మశాలి కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. మందుబాబులు మధ్యాహ్నం నుండే ఆ కట్టపై కూర్చొని తాగుతున్నారని, మహిళలు బయటకు వెళ్లి రావాలంటే భయానక వాతావరణం ఉందన్నారు. మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి చెత్తా చెదారాన్ని తొలగించి ప్రజలు అక్కడ చెత్త వేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని, పోలీసు వారు కట్టపై మద్యం తాగకుండా గస్తీ నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం 17, 35వ వార్డు శాఖ కార్యదర్శి గంజి నాగరాజు, పట్టణ కమిటీ సభ్యురాలు దండెంపల్లి సరోజ, గంజి రాజేష్, కొత్తపల్లి హరీష్, దుదుగు భిక్షపతి, గంజి శంకరయ్య పాల్గొన్నారు.

# తెలంగాణలో మరోసారి ముల్కీ ఉద్యమం వచ్చే అవకాశం : జి దేవీప్రసాద్

హైదరాబాద్ : తెలంగాణ రిజర్వేషన్లను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదని కార్పొరేషన్ మాజీ చైర్మన్ జి .దేవీప్రసాద్ అన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే మరోసారి ముల్కీ ఉద్యమం వచ్చే అవకాశముందని హెచ్చరించారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నేత భుజంగ రావు , టీజీపీఎస్సీ మాజీ సభ్యురాలు సుమిత్రానంద్ , బీసీ కమిషన్ మాజీ సభ్యురాలు ఉపేంద్ర చారితో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ సర్కార్ కొత్తకొత్త నిబంధనలు తీసుకు రావడం వల్ల తెలంగాణ యువతకు తీరని అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. 3 యేండ్లు తెలంగాణ రాష్ట్రంలో బీటెక్ ః బివఇష్త్ర చదివితే స్థానికులు ఎలా అవుతారని ప్రశ్నించారు. తెలంగాణలో బీటె క్ఫూర్తి చేసిన ఇతర రాష్ట్రాల వారు మొత్తం స్థానికులుగానే భావించాల్సి వస్తుందని వెల్లడించారు. ఆంధ్రా ప్రాంతానికి చెందిన పల్లా నిషాంత్ కేసు తెలంగాణ వారికి అన్యాయం జరుగుతుందన్నారు. తీర్పు ఇచ్చిన జడ్జిని తప్పు పట్టడం లేదని, పబ్లిక్ సర్వీస్ కమిషన్ సరైన వాదనలు వినిపించడంలో విఫలం చెందడం వల్లే సమస్య వస్తుందని వివరించారు. సాంకేతక సమస్యలతో ఆదిలాబాద్



కొమరం భీం జిల్లా లాంటి ప్రాంతాల నిరుద్యోగులు ఉద్యోగాలు పొందలేక పోయారని వెల్లడించారు. ఈ అంశాలను గమనించి 95 శాతం ఉద్యోగాలు స్థానికులకే దక్కేలా కేసీఆర్ కృషి చేశారని , 1 వ తరగతి నుంచి 7 వ తరగతి వరకు తెలంగాణలో చదువుకున్న వారిని స్థానికులుగా గుర్తించాలని నిర్ణయం తీసుకున్నారని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రాంతానికి చెందిన విద్యార్థులు ఇతర రాష్ట్రాల్లో చదివితే స్థానికులుగా గుర్తించడం లేదని పేర్కొన్నారు. స్థానిక అంశం తెలంగాణలో మళ్లీ అలజడులు జరిగేలా ఉందని అన్నారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సరైన రీతిలో కౌంటర్ దాఖలు చేయలేదని, జీఏడీ అధికారులు, చీఫ్ సెక్రటరీ సమావేశం నిర్వహించి దీని పై న్యాయ పోరాటం చేయాలని సూచించారు. లేకపోతే ముల్కీ రూల్ ఉద్యమం మళ్లీ వచ్చే అవకాశం ఉందని జోయం చెప్పారు. తెలంగాణ ఉద్యోగులకు బ్యాంక్ అకౌంట్ ఉన్నవారికి బీమా పథక సదుపాయం ఇప్పటికే ఉందని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభలో ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తానని ఎంతో ఆశతో ఎదురుచూశారని, సీఎం వారిని నిరాశపరిచారని తెలిపారు. ఆరు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, సీపీఎస్ గురించి మాట్లాడనే లేదని తెలిపారు. ఈ ప్రభుత్వం ఉద్యోగులను మోసం చేస్తుందని ఆరోపించారు. ప్రభుత్వ విద్యా ఉంటుందా , కనుమరుగు అవుతుందో అనుమానం కలుగుతుందని బీఆర్ఎస్ నాయకుడు భుజంగ రావు తెలిపారు. నాడు కేసీఆర్ విద్యా అవకాశాలు మెరుగు పరురగా రేవంత్ రెడ్డి నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు.

# 'వైటీపీఎస్ ప్రైవేటీకరణ విరమించుకోవాలి'

### స్థానిక నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలి

### సీపీఐ నల్లగొండ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు

దామరచర్ల, జూన్ 26 : యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ లోని యాష్ ప్లాంట్, కోల్ ప్లాంట్ ప్రైవేటీకరణ టెండర్లను ఉపసంహరించుకుని స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని సిపిఐ నల్లగొండ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు, సీపీఐ దామరచర్ల కార్యదర్శి పోలేపల్లి ఉదయ్ కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం దామరచర్ల మండలం వీర్లపాలెం వైటీపీఎస్ మెయిన్ గేటు వద్ద దామరచర్ల సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు పాల్గొని ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా స్థానికులకు ఉద్యోగ కల్పన ఏర్పాటు చేయాలని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదాద్రి పవర్ ప్లాంట్ లోని స్టేజి 1, 2 యూనిట్లకు సంబంధించి ఆపరేషన్, మెయింటెనెన్స్, మెకానికల్, ఎలక్ట్రిక్ పనులను ఉద్యోగుల కొరతను సాకుగా చూపిస్తూ రానున్న మూడు సంవత్సరాల కాలానికి గాను ప్రైవేట్ కాంట్రాక్టర్లు అప్పగించేందుకు టెండర్లను ఆహ్వానించడం సమంజసం కాదన్నారు. ఈ నెల 12 నుండి 29 వరకు టెండర్ల గడువు ప్రకటన చేశారని విద్యుత్ సమస్యతో సతమతమవుతున్న తెలంగాణకు మిగులు విద్యుత్ రాష్ట్రంగా తీర్చిదిద్దాలని స్థానిక





నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని ఉద్దేశంతో గత ప్రభుత్వం వైటీపీఎస్ ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 4 యూనిట్లను ప్రారంభించి ప్రభుత్వ ప్లాంటును ప్రైవేటుపరం చేయడం వల్ల స్థానిక నిరుద్యోగ యువత ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని ప్రైవేటీకరణను సిపిఐ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. చుట్టూ ఉన్న గ్రామాల ఇల్లు భూ నిర్వాసిత ప్లాంట్ ప్రభావిత గ్రామాల యువకులు నిర్వాసితులు ఇప్పటికే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టిన ప్రభుత్వం స్పందించలేదన్నారు. ప్లాంట్ నిర్వహణకు 4,000 మంది సిబ్బంది అవసరం ఉండగా 1,262 మంది మాత్రమే ఉన్నారన్నారు,దీంతో ఉత్పత్తి తీవ్ర ఆటంకం కలుగుతుందని, విద్యుత్ ఉత్పత్తి ప్రారంభమై రెండేళ్లు గడుస్తున్నా అవసరమైన ఉద్యోగాలు నియమించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నారని భూ నిర్వాసితులకు సుమారు 500 మందికి మాత్రమే ఉద్యోగాలు కల్పించినట్లు తెలిపారు. స్థానికంగా 2,000 మందికి ఉపాధి కల్పిస్తామన్న మాటలు ఇప్పటికీ అమలు చేయలేదన్నారు. ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించక పోగా ప్లాంట్ ను ప్రైవేటికరించే ప్రయత్నాలను ఉపసంహరించుకోవాలని, లేదంటే ప్రజలందరినీ సమీకరించి పెద్ద ఎత్తున పోరాటాల నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి పోలేపల్లి ఉదయ్ కుమార్, సిపిఐ సీనియర్ నాయకులు జమ్ముల కోటయ్య, గజ్జల లక్ష్మి, నరసింహ రెడ్డి, పెదపాక వెంకటేష్, పవన్, గాంధీ, కాశయ్య, రమేష్, సత్యానందం, సూర్యం, మహేష్ బాబు, రాము, రవి నాయక్, కృపాకర్ పాల్గొన్నారు.

# అయోధ్య నిధుల దుర్వినియోగం..

### ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ రాజీనామా..

అయోధ్య రామమందిర విరాళాల వ్యవహారంపై కొనసాగుతున్న వివాదం మధ్య కీలక పరిణామం చోటుచేసుకుంది. శ్రీ రామ్ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ తన పదవికి రాజీనామా చేశారు. అలాగే ట్రస్టీ అనిల్ మిశ్రా కూడా తన బాధ్యతల నుంచి వైదొలిగినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. ఇద్దరూ నైతిక బాధ్యత వహిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారంవిరాళాల లెక్కింపులో, నగదు నిర్వహణలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై ప్రత్యేక దర్యాప్తు బృందం (ఎన్ఐటీ) విచారణ కొనసాగిస్తోంది. ఈ కేసులో ఇప్పటికే ఎనిమిది మందిపై కేసులు నమోదయ్యాయి. ఆలయ ఖాతాల నుంచి దాదాపు రూ. 7-7.5 కోట్లు గల్లంతయ్యాయని నివేదికలు సూచిస్తున్నాయి. అయితే అధికారిక లెక్కలు ఇంకా వెలువడలేదు. కాగా, రెండు రోజుల





క్రితం సిట్ తమ ప్రాథమిక నివేదికను యూపీ సర్కారుకు సమర్పించింది అయోధ్య రామాలయానికి వచ్చిన విరాళాలపై ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో తీర్థక్షేత్ర ట్రస్ట్ సభ్యుడు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు (ంఎనీటష్త్రఎజీ నివలిబ). ఇప్పటివరకు ఎనిమిది మందిని అరెస్ట్ చేశారు. వారిలో చంపత్ రాయ్ డ్రైవర్ కూడా ఉన్నారు. దీంతో నైతిక బాధ్యత వహిస్తూ చంపత్ రాయ్ తన పదవికి రాజీనామా చేశారు.

## నీట్ యూజీ 2026 రీ ఎగ్జామ్.. ఆన్సర్ కీ పేపర్ విడుదల.. ఎలా చూడాలంటే




నీట్ యూజీ 2026 రీ ఎగ్జామ్ గత ఆదివారం, జూన్ 21న జరిగిన సంగతి తెలిసిందే. ఈ పరీక్షకు సంబంధించిన ప్రొవిజినల్ ఆన్సర్ కీ గురువారం విడుదలైంది. ఈ విషయాన్ని పరీక్ష నిర్వహణా సంస్థ ఎన్‌టీయే (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) ప్రకటించింది. పరీక్ష రాసిన అభ్యర్థులు ఆన్సర్ కీని సంస్థ అధికారిక వెబ్‌సైట్‌ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అంతేకాదు.. ఈ కీ పేపర్‌పై అభ్యంతరాలుంటే తెలిపేందుకు అవకాశం ఉంది. విద్యార్థులు తమ అప్లికేషన్ నెంబర్, పాస్‌వర్డ్ ద్వారా లాగిన్ అవ్వాలి. ఈ నెల 28, రాత్రి 11.50 నిమిషాల వరకు ఈ ఆన్సర్ కీపై అభ్యంతరాలుంటే తెలపవచ్చు. ఈ కీ పేపర్‌లో ఎలాంటి తప్పులు, అభ్యంతరాలున్నా ఈ సైట్ ద్వారా తెలపవచ్చు. ఇందుకోసం ప్రతి ప్రశ్నకు రూ.200 ఫీజు ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలి. తమ అభ్యంతరాలను సమర్థించే డాక్యుమెంట్లను కూడా సమర్పించాల్సి ఉంటుంది. అభ్యర్థులు తమ సందేహాలు, అభ్యంతరాల్ని ఒక్కసారి మాత్రమే సమర్పించాల్సి ఉంటుంది. ఒకసారి సబ్మిట్ చేసిన తర్వాత ఎడిట్ చేసే అవకాశం మాత్రం ఉండదు. అందుకే వాటిని ఆన్‌లైన్‌లో సమర్పించే ముందే సరి చూసుకోవాలి. సబ్జెక్ట్ నిపుణులు ఈ అభ్యంతరాలు, సూచనలను పరిశీలిస్తారు. అనంతరం వాటిని అంగీకరించి అవి సరైనవే అని నమ్మితే అభ్యర్థులు చెల్లించిన ఫీజును తిరిగి వాపస్ ఇస్తారు. విశ్లేషకుల అంచనా ప్రకారం.. నీట్ స్కోర్ ఆధారంగా సీట్ల కేటాయింపు ఇలా ఉండవచ్చు. 650-720 మార్కులు వస్తే ప్రభుత్వ ఎంబీబీఎస్ సీటు రావొచ్చు. 600-649 మార్కులు వస్తే ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో సీటు రావొచ్చు. 590-599 మధ్య మార్కులు వస్తే ఎంబీబీఎస్ సీటు వచ్చే అవకాశాలు ఎక్కువ. అయితే, ఇది రాష్ట్రాన్ని బట్టి, ఇతర రిజర్వేషన్లు వంటి అంశాలపై ఆధారపడి ఉంటుంది. 550-589 మార్కులు వస్తే ఎంబీబీఎస్‌లో పలు కాలేజీల్లో అవకాశం ఉంటుంది. ర్యాంకును బట్టి ఏదో ఒక కాలేజీలో సీటు రావొచ్చు. 550 మార్కులకంటే తక్కువ స్కోర్ వస్తే ప్రభుత్వ కాలేజీల్లో ఎంబీబీఎస్ సీటు వచ్చే అవకాశం తక్కువ. అయితే, ఇతర ప్రైవేటు కాలేజీల్లో మాత్రం అవకాశం ఉంటుంది. అలాగే, ఇతర మెడికల్ కోర్సులు చేయవచ్చు. అయితే, ఇవన్నీ గతంలో వచ్చిన మార్కుల ఆధారంగా వచ్చిన అంచనాలు మాత్రమే. ఏ ఏడాదికి ఆ ఏడాది స్కోర్లు మారుతుంటాయి. అప్పుడు వీటిలో మార్పులు ఉండే ఛాన్స్ ఉంది.

## యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి : ఎస్పీ అక్షాంశు యాదవ్




భువనగిరి అర్బన్, జూన్ 26 : యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని భువనగిరి యాదాద్రి జిల్లా ఎస్పీ అక్షాంశు యాదవ్ అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజల్లో అవగాహన కల్పించడం, మత్తు పదార్థాల రహిత సమాజ నిర్మాణం లక్ష్యంగా భువనగిరి పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం భువనగిరి పట్టణంలో 2 కే అవగాహన ర్యాలీని ఎస్పీ అక్షాంశు యాదవ్ ప్రారంభించారు. ఈ ర్యాలీ పాత బస్టాండ్ నుండి ప్రారంభమై వినాయక చౌరస్తా వరకు కొనసాగింది. విద్యార్థులు, ప్రజలు, పోలీసు అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ? మాదక ద్రవ్యాల అక్రమ రవాణా లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని చెప్పారు. సమాజంలో మాదక ద్రవ్యాల నిర్మాణంలో యువకులు ముందుండాలన్నారు. విద్యార్థి దశ నుండి సమాజంపై మంచి ఆలోచన పెట్టాలని, సమాజాన్ని బాగు చేయడంతో పాటు తన జీవితాన్ని, తన భవిష్యత్‌ను మంచి మార్గంలో నడుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ లక్ష్మీనారాయణ, డీఎస్పీ రవీందర్, ట్రాఫిక్ డీఎస్పీ ప్రభాకర్ రెడ్డి, సీఐలు చంద్రబాబు, రమేష్, ప్రభాకర్ రెడ్డి, ఎస్ఐలు అనిల్ కుమార్, నరేష్, పోలీసు అధికారులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

## బాలిక ఛాతిపై తన్నిన అంగన్‌వాడీ వర్కర్..

మహారాష్ట్రలో తాజాగా షాకింగ్ ఘటన వెలుగు చూసింది. అభంశుభం తెలియని ఒక బాలిక ఛాతిపై అంగన్‌వాడీ వర్కర్ తన్నడంతో చిన్నారి మెట్లపై నుంచి దొర్లి పడిపోయింది. రాయ్‌గఢ్ జిల్లా పన్వేల్‌లోగల నంద్‌గావ్ అంగన్‌వాడీ కేంద్రంలో తాజాగా ఈ దారుణం వెలుగు చూసింది. ఘటన గురించి సమాచారం అందగానే నవీ ముంబై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. అంగన్‌వాడీ కేంద్రం వద్ద భద్రతా సిబ్బందిని కూడా మోహరించారు. ఈ ఘటన తాలూకు వీడియో నెట్టింట వైరల్‌గా మారడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చిన్నారుల సంరక్షణ బాధ్యతలు తీసుకున్న వ్యక్తే ఇలా క్రూరంగా ప్రవర్తించడంపై జనాలు మండిపడుతున్నారు. నిస్సహాయంగా ఉన్న చిన్నారిపై దాడి చేయడం దానవత్వం అంటూ విమర్శిస్తున్నారు. నిందితురాలిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## అడ్డంగా బుక్కైన సీఐ నాగరాజు



విజయవాడ, జూన్ 26,ఏపీలో సంచలనంగా మారుతోంది సాయి కృష్ణ లాకప్ డెxత్ మిస్టరీ. ఇప్పటికే వైసీపీ నేతలు కుల రాజకీయం మొదలుపెట్టారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పై వ్యక్తిగతంగా, రాజకీయంగా, కుల పరంగా టార్గెట్ చేశారు. అదృశ్యం తరహాలో కేసు విచారణ మొదలుపెట్టిన ప్రత్యేక దర్యాప్తు బృందం ఇందుకు ప్రధాన నిందితుడిగా భావిస్తున్న సిఐ నాగరాజును అదుపులోకి తీసుకుంది. అయితే సాయి కృష్ణ మిస్సింగ్ మిస్టరీ కాస్త లాకప్ డెxత్ గా బయటపడింది. సిఐ రిమాండ్ రిపోర్ట్లో అత్యా అని తేల్చేసింది సిట్. పోలీస్ కస్టడీలో తగిలిన గాయాల వల్లే సాయి కృష్ణ మరణం సంభవించిందని నిర్ధారించింది. దీంతో కుటుంబ సభ్యుల అనుమానాలు నిజమయ్యాయి. అయితే సాయి కృష్ణ మృతదేహాన్ని ఖననం చేశారా? లేకుంటే ఎక్కడైనా విడిచి పెట్టారా? అన్నది తెలియాల్సి ఉంది.అయితే సాయి కృష్ణ తల్లి విజయలక్ష్మి తన కుమారుడిని చంపేశారు అంటూ ఆది నుంచి ఆరోపిస్తున్నారు. కచ్చితంగా ఆనవాళ్లు, అనుమానాలు ఉండడంతో పాటు సంకేతాలు రావడంతోనే ఆమె ఆ తరహా ఆరోపణలు చేశారని ఇప్పుడు అర్థం అవుతోంది. సాయి కృష్ణ మే 6న మార్చాపురంలో టాస్క్ ఫోర్స్ సిబ్బంది పట్టుకెళ్లారు. కృష్ణలంక పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఇక్కడే నిందితుడిగా భావిస్తున్న సిఐ నాగరాజు వ్యూహాత్మకంగా అడుగులు వేసినట్లు అర్థం అవుతుంది. మే 1 నుంచి జూన్ 1 వరకు కృష్ణలంక పోలీస్ స్టేషన్లో ఉన్న సీసీటీవీ ఫుటేజ్ పూర్తిగా మాయమైంది. అయితే ఇప్పటివరకు అదృశ్యం కేసు గానే ఉండేది. ఇప్పుడు లాకప్ డెxత్ అని తెలియడంతో దాని వెనుక జరిగిన పరిణామాలపై అసలు సిసలైన విచారణ మొదలుకానుంది.అసలు సాయి కృష్ణ పై మోపిన అభియోగాలు ఏంటి? ఏ కేసులో టాస్క్ ఫోర్స్ పోలీసులు సాయికృష్ణను అదుపులోకి తీసుకున్నారు? సిఐ నాగరాజుకు సరెండర్ చేసిన తర్వాత ఏం జరిగింది? అసలు లాకప్ డెxత్ చేయాల్సిన అవసరం సిఐ నాగరాజుకు ఎందుకు వచ్చింది? దీని వెనుక పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాలు ఉన్నాయా? లేకుంటే పెద్దల పాత్ర వుందా? ఒక నిందితుడిని అదుపులోకి తీసుకొని కోర్టుకు హాజరు పరచకుండా ఎందుకలా చేశారు? అన్నింటికి మించి సాయి కృష్ణ మృతదేహం ఇప్పుడు ఎక్కడ ఉంది? ఖననం చేశారా? దహనం చేశారా? లేకుంటే ఎక్కడైనా పారవేశారా? అనేది ఇప్పుడు రెండో చార్జ్ షీట్లో తప్పకుండా వెల్లడయ్యే అవకాశం ఉంది. అయితే ఈ కేసు వెనుక ఏం జరిగిందనే దానిపై పోలీసు వర్గాలకు ఇప్పటికే ఒక స్పష్టత ఉంది. ఎందుకంటే మృతుడు సాయి కృష్ణకు నేరచరిత ఉంది. అయితే నేరస్తులంతా లాకప్ డెxత్ చేస్తామంటే కుదరదు. అయితే ఈ స్థాయికి పరిస్థితి వచ్చింది అంటే తెర వెనుక ఏం జరిగింది అనేది ఇప్పుడు కచ్చితంగా బయటపడుతుంది. అంతవరకు వేచి చూడాల్సిందే.

## సింగపూర్ కు సముద్రమార్గంలో బంగినపల్లి

విజయవాడ, జూన్ 26, దేశీయ వ్యవసాయ రంగ ఉత్పత్తుల ఎగుమతుల్లో ఒక కీలక మైలురాయి నమోదయ్యింది. అత్యంత ప్రసిద్ధి చెందిన బంగినపల్లి మామిడి పండ్లను వాణిజ్యపరంగా తొలిసారి సముద్ర మార్గం ద్వారా సింగపూర్‌కు విజయవంతంగా పంపారు. దీంతో తక్కువ ఖర్చు, పర్యావరణ హితంగా తాజా పండ్లను ప్రపంచ మార్కెట్లకు చేర్చేందుకు కొత్త మార్గం సుగమమైంది. ఈ విషయాన్ని కేంద్ర వాణిజ్య శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ మొత్తం ప్రక్రియను వ్యవసాయ, శుద్ధిచేసిన ఆహార ఉత్పత్తుల ఎగుమతి అభివృద్ధి పర్యవేక్షించింది. ఇందులో భాగంగా జూన్ 11న ఓసమ్ ఫుడ్ సొల్యూషన్స్ 5 మెట్రిక్ టన్నుల బంగినపల్లి మామిడి పండ్లను ఎగుమతి చేయగా.. ఈ కన్సైన్‌మెంట్ జూన్ 24న సింగపూర్ చేరుకుంది. ఈ ఎగుమతి ప్రక్రియ విజయవంతం కావడం వెనుక లక్నోలోని ఐకార్‌కు చెందిన సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ సబ్‌ట్రాపికల్ హార్టికల్చర్ కీలక పాత్ర పోషించింది.ఎగుమతి కోసం ఆంధ్రప్రదేశ్‌లోని 'గుడ్ అగ్రికల్చరల్ ప్రాక్టీసెస్' (జీఏపీ) ధ్రువీకరణ పొందిన తోటల నుంచి సేకరించిన మామిడి పండ్లను.. కర్ణాటకలోని అపెడా గుర్తింపు పొందిన ప్యాక్‌హౌస్‌లో శుద్ధి చేసి ప్యాకింగ్ చేశారు. ఈ ఎగుమతి ద్వారా రైతులకు భారీ ఆర్థిక ప్రయోజనం చేకూరింది. స్థానిక మార్కెట్‌లో మామిడి కిలో రూ. 25- రూ. 26 పలుకుతోంది. కానీ, సింగపూర్‌కు ఎగుమతి చేయడం ద్వారా కిలోకు సుమారు రూ. 50 వరకు లభించింది. దీంతో రైతుల ఆదాయం దాదాపు రెట్టింపయ్యింది.అలాగే, ఈ మామిడి పండ్లను దిగుమతి చేసుకున్న సింగూర్ సంస్థ ఈసీ-లింక్స్ లిమిటెడ్.. నాణ్యత అద్భుతంగా ఉందని ప్రశంసించింది. పండ్ల తియ్యదనం, ఒకేరీతిలో పక్వానికి రావడం, ఎక్కువ కాలం నిల్వ ఉండటం వంటి లక్షణాలను ఆ సంస్థ ప్రత్యేకంగా అభినందించింది. సింగపూర్ నిర్దేశించిన నాణ్యత, ఫైటోశానిటరీ ప్రమాణాలను ఈ కన్సైన్‌మెంట్ విజయవంతంగా అందుకోవడం హర్షణీయం. శాస్త్రీయ విధానాల్లో మామిడి కోత, ఉత్తమ యాజమాన్య పద్ధతులు, సముద్ర రవాణాలో కోల్డ్-చైన్ లాజిస్టిక్స్ సమర్థతను ఇది నిరూపించింది.బంగినపల్లి మామిడి పండు తన బంగారు పసుపు వర్ణం, పీచులేని గుజ్జు, చక్కటి సువాసన, అద్భుతమైన తీపిదనంతో అంతర్జాతీయంగా గుర్తింపు పొందింది. ఇక, జలమార్గం ద్వారా ఎగుమతి ఖర్చు వాయు మార్గంతో పోలిస్తే తక్కువకావడమే కాదు, పర్యావరణ హితమైందని, వాణిజ్యపరంగా లాభదాయకమైందని రుజువు చేసింది. అలాగే, శక్తిమంతమైన కోల్డ్-చైన్ మౌలిక సౌకర్యాలు, శాస్త్రీయ నిర్వహణ విధానాల సహకారంతో సముద్ర మార్గాల ద్వారా రవాణా భారత ఉద్యానవన ఉత్పత్తుల ఎగుమతులను ప్రపంచవ్యాప్తంగా బలోపేతం చేస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.వ్యవసాయ ఎగుమతులను పెంచడం, రైతుల ఆదాయం రెట్టింపు చేయడం, భారతీయ వ్యవసాయ ఉత్పత్తులకు అంతర్జాతీయంగా తగినంత గుర్తింపు తీసుకురావడం అనే కేంద్ర ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా అపెడా ఈ చొరవ తీసుకుంది. ఈ విజయం భవిష్యత్తులో మరిన్ని భారతీయ వ్యవసాయ ఉత్పత్తులను జల మార్గంలో ఎగుమతి చేసేందుకు ప్రోత్సాహాన్ని అందిస్తుందని కేంద్ర వాణిజ్య శాఖ తన ప్రకటనలో పేర్కొంది.

# టీడీపీలో తమ్ముళ్ల తగాదాలు

నెల్లూరు, జూన్ 26, (నెల్లూరు జిల్లా ఉదయగిరి టిడిపిలో ఇంటర్నల్‌గా రీ సౌండ్స్ వస్తున్నాయట. ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు వ్యతిరేకంగా ఒక వర్గం రీ యూనియన్ అవుతున్నట్టు తెలుస్తోంది. పాత తరం పార్టీ నేతలకు, ఎమ్మెల్యేకి మధ్య బాగా గ్యాప్ పెరిగిపోతున్నట్టు చెప్పుకుంటున్నారు. వరుస భూ వివాదాలు కాకర్ల మెడకు చుట్టుకుంటున్నాయట. అనుచరులు చేసే తప్పులకు కోర్టు మెట్లు ఎక్కాల్సి రావడం ఎమ్మెల్యేకి తలనొప్పిగా మారుతోందంటున్నారు. ఆయన వ్యవహార శైలి నచ్చని పాత తరం టిడిపి నేతలందరూ మాజీ ఎమ్మెల్యే బొల్లినేని రామారావుకి టచ్‌లోకి వెళ్తున్నట్టు తెలుస్తోంది. మండలాల్లో తమకేం పనులు జరగడంలేదని.. పోలీసులు, రెవెన్యూ అధికారులు సైతం ఎమ్మెల్యే మనుషులు చెప్పినట్టే పనిచేస్తున్నారంటూ సీనియర్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారట. 2024 ఎన్నికలకు ముందు ఉదయగిరి నియోజకవర్గ ఇన్చార్జిగా బొల్లినేని రామారావు ఉన్నారు. అయితే ఫైనల్‌గా ఆయన్ని కాదని టీడీపీ అధిష్టానం ఎన్నారై కాకర్ల సురేష్‌కు మొదటి లిస్ట్‌లోనే అవకాశం కల్పించింది. అప్పటి వరకు కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు చేసిన సురేష్.. అన్ని వర్గాలను కలుపుకొని జనంలోకి వెళ్ళి ఫస్ట్ అటెంప్ట్‌లోనే విజయం సాధించారు. కానీ? గెలిచాక వైఖరి మారిందన్నది స్థానికంగా వినిపిస్తున్న మాట. వరుస వివాదాలు చుట్టు ముడుతుండగా? అటు బొల్లినేని వర్గాన్ని సైతం దూరం పెట్టేశారన్నది కేడర్ చెబుతున్న మాట. తన వర్గాన్ని దూరం పెట్టినా? బొల్లినేని రామారావు పెద్దగా రియాక్ట్ అవకుండా, నియోజకవర్గ రాజకీయాల్లో వేలు పెట్టకుండా.. నెలకోసారి తన వాళ్ళని కలుస్తున్నారు.ఈ క్రమంలోనే తాజాగా ఓ ఇంట్రెస్టింగ్ చర్చ ఉదయగిరి నియోజకవర్గంలో జరుగుతోంది. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఒక వివాహానికి మాజీ ఎమ్మెల్యే వెళ్ళగా.. అదే పెళ్ళికి ఉదయగిరి నియోజకవర్గానికి చెందిన పాతతరం టీడీపీ నేతలు, పలువురు మండలాధ్యక్షులు హాజరయ్యారు. వాళ్ళంతా కలిసి అప్పుడు ఎమ్మెల్యే మీదున్న అసంతృప్తిని బొల్లినేని దగ్గర వెళ్ళగక్కినట్టు తెలిసింది. కాకర్ల తమను పట్టించుకోవడంలేదని, ఒక సిఐ తో పాటు పలువురు అధికారులను మార్చాలని కోరినా.. చేద్దాం చూద్దామనే మాటలే తప్ప పని జరగడం లేదని వాపోయారట. పోలీస్ స్టేషన్లతో పాటు మండల కార్యాలయాల్లో కూడా తమకు పనులు జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేసినట్టు తెలిసింది.

అలాగే?. ప్రజలకు, ఎమ్మెల్యేకి మధ్య గ్యాప్ పెరిగిపోవడం వల్లే.. పార్టీకి మైలేజ్ రావడం లేదని అంతర్గతంగా మాట్లాడుకున్నట్టు తెలిసింది. వింజమూరు, ఉదయగిరి, దుత్తలూరు, కలిగిరిలో ఎమ్మెల్యే పేరు చెప్పుకొని గ్రావెల్ మాఫియా రెచ్చిపోతోందని, పార్టీకీ అది పెద్ద డ్యామేజ్ అంటూ చెప్పుకొచ్చారట. ఓ సీఐ వ్యవహార శైలి కూడా ఎమ్మెల్యే కాకర్ల కు చెడ్డ పేరు తీసుకొచ్చేలా ఉందన్నది సీనియర్స్ వాయిస్. నక్కలగండి రిజర్వాయర్ లో ఉండే మత్స్య సంపదను ప్రైవేట్ వ్యక్తులు కాజేస్తుంటే ఎమ్మెల్యే కనీసం పట్టించుకోలేదన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. ఓ పోలీస్ అధికారి పర్యవేక్షణలో ఈ చేపల దందా సాగుతోందట. ఈ వ్యవహారం ఎమ్మెల్యే కి తెలుసా లేదా అనే అనుమానాలను స్థానిక టీడీపీ నేతలు వ్యక్తం చేస్తున్నారు.ఇప్పుడసలు నియోజకవర్గంలో ప్రతిపక్షం బలంగా ఉండి ఉంటే పరిస్థితి మరోలా ఉండేదన్న చర్చ కూడా నేతల మధ్య జరిగిందట. ఈ పరిస్థితుల్లో ఉదయగిరి నియోజకవర్గంలో మళ్లీ యాక్టివ్ అవ్వాలని బొల్లినేని రామారావును పాత తరం టీడీపీ నేతలు కోరినట్టు తెలిసింది. ప్రస్తుతం పార్టీ సెంట్రల్ ఆఫీసులోని గ్రీవెన్స్ సెల్‌లో జాతీయ ఉపాధ్యక్షుడి హోదాలో పని చేస్తున్నారు బొల్లినేని రామారావు. ఇక నుంచి ఉదయగిరి నియోజకవర్గ రాజకీయాలపై కూడా దృష్టి పెట్టాలని కోరారట స్థానిక నేతలు. మరోవైపు ఎమ్మెల్యే కాకర్ల సురేష్? ఎమ్మెల్సీ బీద రవిచంద్రతో సన్నిహితంగా ఉండే వాళ్ళని కూడా దూరం పెడుతున్నట్టు చెప్పుకుంటున్నారు. ఇవన్నీ జిల్లా అధ్యక్షులకు చెప్పలేక, దూరం పెడుతున్న ఎమ్మెల్యేకి దగ్గర అవ్వలేక కొందరు టీడీపీ సీనియర్స్ సతమతమవుతున్నారట. గతంలో ఎమ్మెల్యేకి దగ్గరగా ఉన్న ఒకరిద్దరు నేతలు కూడా ఇప్పుడు బొల్లినేనికి టచ్‌లో ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. సీఎం చంద్రబాబు హెచ్చరికల తర్వాత ఎమ్మెల్యేలో మార్పు వస్తుందని అందరూ భావించారని, కానీ ప్రస్తుతం అలాంటిదేమీ కనిపించడం లేదని సొంత నేతలే చెబుతున్నారు. వైసీపీ నుంచి వచ్చిన ఒకరిద్దరు నేతలకి ప్రాధాన్యం ఇస్తున్నారని.. తమను పట్టించుకోవడంలేదని పాత తరం నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొత్తంగా రాబోయే రోజుల్లో మెట్ట ప్రాంత నియోజకవర్గ రాజకీయం రసకందాయంలో పడే అవకాశాలు కనిపిస్తున్నాయన్నది విశ్లేషకుల అభిప్రాయం.

# శత్రువులుగా మిత్రపార్టీలు

ఏలూరు, జూన్ 26, కాపు కులం కేంద్రంగా రాష్ట్రంలో జరుగుతున్న తాజా రాజకీయ పరిణాలు ఆయన్ని ఇరకాటంలో పడేస్తున్నాయంటున్నారు. ఇటీవల వైసీపీ కాపు నేతలంతా కలిసి మీటింగ్ పెట్టుకున్నాక జరుగుతున్న పరిణామాల మీద, పార్టీ తరపున కౌంటర్స్ వేసేందుకు ముందుండమని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యేని ఆదేశించిందట జనసేన అధిష్టానం. అందుకు తగ్గట్టే ప్రత్యర్థుల్ని అదీకూడా సొంత సామాజికవర్గానికి చెందిన వాళ్ళని గట్టిగానే టార్గెట్ చేస్తున్నారు బొలిశెట్టి శ్రీనివాస్. అలాగే? ఆయన ఏం మాట్లాడినా వెంటనే వైసీపీ కాపు నేతల వైపునుంచి రివర్స్ పంచ్‌లు కూడా స్ట్రాంగ్‌గా పడుతున్నాయి. దీంతో బొలిశెట్టి బాగా ఫీలవుతున్నట్టు తెలుస్తోంది.రాష్ట్రంలో చాలామంది జనసేన నాయకులు ఉన్నప్పటికీ? ప్రతిపక్ష నేతల్ని, ప్రత్యేకించి కాపు సామాజిక వర్గ నేతలను ఎదుర్కోవడం ఓ రకంగా ఇబ్బందికరమేనని భావిస్తున్నారట. దీంతో ఎమ్మెల్యే అయ్యానన్న ఆనందంకంటే ఇదెక్కడి పొలిటికల్ కులగోల అన్న అసహనమే పెరిగిపోతున్నట్టు చెప్పుకుంటున్నారు. మరోవైపు సొంత నియోజకవర్గంలో ఉన్న తెలుగుదేశం పార్టీ నేతలు ఆయనతో కలిసి పని చేయడానికి ముందుకు రాకపోగా ఇమేజ్‌ని డామేజ్ చేయడానికి చేస్తున్నారట. అందుకే శత్రువులుగా మారిన మిత్ర పార్టీ నేతలతో పోరాడడానికే రెండేళ్లు సరిపోయిందంటూ ఏ వేదికల మీద బహిరంగంగానే ఆవేదన వ్యక్తం చేస్తున్నారాయన. కలిసి పని చేయండని రెండు పార్టీల అధిష్టానాలు ఆదేశిస్తున్నాతాడేపల్లిగూడెంలో తెలుగుదేశం నాయకులు మాత్రం జనసేనతో కలిసి ముందుకెళ్లేందుకు ససేమిరా అంటున్నారన్నది ఎమ్మెల్యే మాట. పైగా ఎమ్మెల్యే ఎంతో మేమూ అంతేనన్నట్టుగా టిడిపి ఇన్చార్జ్ వలవల బాబ్జీ వ్యవహరిస్తున్నారన్నది బొలిశెట్టి వర్గం కంప్లయింట్. ఇలాంటి సమయంలో వైసీపీని ఏకిపారేయాల్సి రావడం అదనపు తలనొప్పిగా మారిందన్నది ఆయన సన్నిహితుల మాట. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో మాటల తూటాలు సరిగ్గా టార్గెట్ చేరితే సరే.. ఎక్కడైనా రివర్స్ అయిందంటే అసలుకే ఎసరు వచ్చి సొంత కులం వాళ్ళకే తాను టార్గెట్ అవుతానన్న భయం కూడా బొలిశెట్టిని వెంటాడుతోందట.దాంతో అధిష్టానం ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తూనే.. కాపు కులానికి చెందిన ప్రత్యర్థుల విషయంలో ఆచితూచి అడుగులు వేయాల్సి వస్తోందని, ఫైనల్‌గా అందరి టార్గెట్ నేనే అవుతానా అన్న అనుమానం సైతం ఆయన్ని వెంటాడుతోందట. మిత్ర పార్టీ నేతలతో ఇంట గెలిచేందుకు ఇప్పటికే నానా తంటాలు పడుతుంటే.. ఇప్పుడు రచ్చ గెలవాల్సిన అనివార్యత ఎదురవుతోంది. ఇదే విషయాన్ని చెబుతూ?. పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ తనను బాహుబలి అని ఎందుకు పిలిచారో ఇప్పుడు అర్థమవుతోందని సన్నిహితుల దగ్గర సెటైర్లు సైతం వేస్తున్నారట ఎమ్మెల్యే. రోజు రోజుకి కాక పెంచుతున్న జనసేన వర్సెస్ వైసీపీ రాజకీయం ఒకవైపు, తాడేపల్లిగూడెంలో టిడిపి వర్సెస్ జనసేన ఫైట్‌లో ఎవరు కట్టప్పలవుతారో అర్థం కాని అయోమయం మరోవైపు కలగలిసి తీవ్ర గందరగోళంలో ఉన్నారట శ్రీనివాస్. దీంతో కూటమిలోని ఇబ్బందులేంటో తన దాకా వస్తేగానీ? ఎమ్మెల్యేకి తెలియడం లేదా? ఇప్పటికైనా మా బాధలేంటో అర్థం చేసుకోండని కింది స్థాయి నాయకులు సూటిపోటి మాటలు అంటున్నారట. అలా మొత్తం మీద మా ఎమ్మెల్యే గట్టిగానే ఇరుక్కున్నారన్నది తాడేపల్లిగూడెం టాక్.

## ఎట్టకేలకు వై. శ్రీలక్ష్మికి ప్రభుత్వం పోస్టింగ్

విజయవాడ, జూన్ 26, ఆంధ్రప్రదేశ్ బ్యూరోక్రసీలో వివాదాస్పద అధికారిణిగా గుర్తింపు పొందిన 1988 బ్యాచ్ సీనియర్ ఐఏఎస్ వై. శ్రీలక్ష్మికి ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఎలాంటి బాధ్యతలు లేకుండా వెయిటింగ్ లో ఉన్న ఆమెను.. హఠాత్తుగా రాష్ట్ర ప్రభుత్వ సాధారణ పరిపాలన శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా నియమిస్తూ చంద్రబాబు సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, ఈ ఆకస్మిక నిర్ణయం వెనుక ఎలాంటి రాజకీయ ప్రాధాన్యతలు లేవని, కేవలం మానవతా దృక్పథంతో ఆమెకు గౌరవప్రదమైన వీడ్కోలు పలికేందుకే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందనే పచ్చి నిజం బ్యూరోక్రాటిక్ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. అధికారిక నిబంధనల ప్రకారం.. వై. శ్రీలక్ష్మి ఈ జూన్ 30వ తేదీతో తన సుదీర్ఘ ఐఏఎస్ సర్వీసు నుండి రిటైర్ కానున్నారు. అంటే ఆమె పదవీ కాలం ముగియడానికి కేవలం మరో నాలుగు రోజులు మాత్రమే మిగిలి ఉంది. ఒకవేళ ఎలాంటి పోస్టింగ్ లేకుండా వెయిటింగ్‌లోనో లేదా లూప్ లైన్ పరిధిలోనే రిటైర్ అయితే, ఆ ప్రభావం ఆమె రిటైర్మెంట్ బెనిఫిట్స్‌పై, పెన్షన్ నిబంధనలపై పడే అవకాశం ఉంది. ఒక సీనియర్ మహిళా అధికారిణిగా ఆమె సుదీర్ఘ కెరీర్ ముగింపు దశలో ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో, సర్వీసులో ఉంటూ గౌరవప్రదంగా ఉద్యోగ విరమణ పొందేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు భావిస్తున్నారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కెరీర్ ప్రారంభించిన వై. శ్రీలక్ష్మి.. రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణ కేడర్‌కు కేటాయించారు. అయితే, ఏపీలో జగన్ అధికారంలోకి వచ్చాక.. ఏపీకి వచ్చేందుకు సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ ను ఆశ్రయించారు. క్యాట్ ఆదేశాల ద్వారా తెలంగాణ నుండి ఏపీ కేడర్‌లోకి బదిలీ చేయించుకున్నారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో ఆమెకు విపరీతమైన ప్రాధాన్యత దక్కింది. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఆమె సచివాలయంలో చక్రం తిప్పారు. జగన్ హయాంలోనే ఆమెకు వరుస ప్రమోషన్లు లభించి బ్యూరోక్రసీలో టాప్ పొజిషన్‌కు చేరుకున్నారు.ఐఏఎస్ వై. శ్రీలక్ష్మి సుదీర్ఘ కెరీర్ ఎంత వైభవంగా సాగిందో.. దానికి రెట్టింపు స్థాయిలో పెను వివాదాలు, లీగల్ ఇబ్బందులు ఆమెను చుట్టుముట్టాయి. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో జరిగిన ఓబుళాపురం మైనింగ్ కంపెనీ అక్రమ మైనింగ్ కేసులో ఆమె తీవ్ర చట్టపరమైన ఇబ్బందులను ఎదుర్కొన్నారు. నాటి మైనింగ్ శాఖ కార్యదర్శిగా ఉన్న శ్రీలక్ష్మి నిబంధనలకు విరుద్ధంగా గాలి జనార్దన్ రెడ్డికి అనుకూలంగా జీవోలు ఇచ్చారనే ఆరోపణలపై కేంద్ర దర్యాప్తు సంస్థ ఆమెను అరెస్ట్ చేసింది. ఈ కేసుల వల్ల ఆమె ఐఏఎస్ సర్వీసు నుండి సస్పెండ్ అవ్వడమే కాకుండా, చంచల్‌గూడ జైల్లో సుదీర్ఘ కాలం రిమాండ్ ఖైదీగా జైలు శిక్షను కూడా అనుభవించాల్సి వచ్చింది. జగన్ అక్రమాస్తుల కేసుల్లో సైతం ఆమె పేరు ప్రముఖంగా వినపడింది.ఆమెపై ఇప్పటికీ పలు కోర్టు కేసులు, తీవ్రమైన అవినీతి ఆరోపణలు నడుస్తున్నప్పటికీ.. వాటన్నింటినీ పక్కనబెట్టి, రిటైర్మెంట్‌కు కేవలం నాలుగు రోజుల ముందు ప్రభుత్వం ఆమె సీనియారిటీని గౌరవించింది.

## భీమిలి నుంచి తేజస్విని

విశాఖపట్టణం జూన్ 26, భీమిలీ నియోజకవర్గం విశాఖలో అతి ముఖ్యమైన సీటు. భీమిలీ స్వీట్ సీట్ అని కూడా అంటారు. టీడీపీకి కంచుకోట భీమిలీ. అత్యధిక సార్లు టీడీపీ అభ్యర్థులే గెలిచారు. ఇక ఇటీవల కాలంలో చూస్తే భీమిలీ ప్రాంతం అంతా మరో జూబ్లీ హిల్స్ గా మారిపోతోంది. అనేక ఐటీ పరిశ్రమలు రిసార్టులు హ్పటెల్స్ వస్తున్నాయి. భీమిలీ నియోజకవర్గంలోనే అతి పెద్ద గూగుల్ డేటా సెంటర్ కూడా ఏర్పాటు అయింది. ఇన్ఫోసిస్ సహా కీలకమైన ఐటీ కంపెనీలు వస్తున్నాయి. దాంతో భీమిలీ మీద అందరికీ మోజు అయితే పెరిగిపోతోంది. భీమిలీ నుంచి వచ్చే ఎన్నికల్లో పోటీ చేయడానికి కూడా ఎవరికి వారుగా ఇప్పటి నుంచే ప్రయత్నాలు చేసుకుంటున్నారు అని కూటమిలో వినిపిస్తోంది. జనసేన అయితే వచ్చే ఎన్నికల్లో భీమిలీ నుంచి పోటీకి సిద్ధం అని ప్రచారం జరుగుతోంది. మరో వైపు చూస్తే మాజీ మంత్రి భీమిలీ నుంచి రెండు సార్లు గెలిచిన మాజీ ఎమ్మెల్యే అవంతి శ్రీనివాస్ జనసేనలో చేరి భీమిలీ నుంచి పోటీ చేస్తారు అని కూడా అంటున్నారు. ఇక సిట్టింగ్ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కూడా తన రాజకీయ వారసుడిని భీమిలీ నుంచి 2029 ఎన్నికల్లో పోటీకి దించాలని చూస్తున్నారు అని కూడా అంటున్నారు. ఈ నేపథ్యంలో సడెన్ గా ఒక గాసిప్ అయితే గట్టిగా వినిపిస్తోంది. అదేంటి అంటే విశాఖ ఎంపీ శ్రీ భరత్ సతీమణి సినీ నటుడు హిందూపురం



ఎమ్మెల్యే బాలయ్య చిన్న కుమార్తె తేజస్విని భీమిలీ నుంచి 2029 ఎన్నికల బరిలో దిగుతుందని ఆ గాసిప్ సారాంశం. ఇది సాధ్యపడుతుందా అంటే ఎందుకు కాదని అనేవారు ఉన్నారు. భరత్ ఎంపీగా ఉన్నారు. ఆయన 2024లో బంపర్ మెజారిటీతో గెలిచారు. వచ్చే ఎన్నికల్లో ఆయన మళ్లీ ఎంపీగా పోటీ చేస్తారు అని అంటున్నారు. దాంతో తన ఎంపీ నియోజకవర్గం పరిధిలోకి వచ్చే భీమిలీ నుంచి సతీమణిని పోటీ చేయించాలని శ్రీ భరత్ అనుకోవడంలో తప్పు లేదని అనే వారూ ఉన్నారు. భీమిలీ నుంచి ఎవరు టీడీపీ నుంచి పోటీ చేసినా గ్యారంటీగా విక్టరీ ఉంటుందని అంతా చెబుతారు. అదే నిజం కూడా. ఇక ఏకంగా బాలయ్య కుమార్తె పోటీ చేయాలనుకుంటే భీమిలీ సీటు టీడీపీ వశం అని కళ్ళు మూసుకునే చెప్పాల్సి ఉంటుందని అంటున్నారు. ఇంతకీ తేజస్వినికి రాజకీయాల మీద ఇంట్రెస్ట్ ఉందా లేదా అన్నది చూడాల్సి ఉందని అంటున్నారు. ఇక్కడ కొసమెరుపు ఏంటి అంటే 1994 ఎన్నికల సందర్భంగా అన్న నందమూరి తారక రామారావు భీమిలీ నుంచి పోటీ చేయాలని అనుకున్నారని ప్రచారంలో ఉంది. చివరి నిముషంలో ఆయన టెక్కలికి వెళ్ళారు. ఇక 2019 ఎన్నికల సమయంలో నారా లోకేష్ భీమిలీ నుంచి పోటీ చేస్తారు అని కూడా వార్తలు వచ్చాయి. మరి ఇపుడు ఈ గాసిప్ వస్తోంది. అది కూడా ఎన్నికలకు మూడేళ్ళ ముందు. మరి ఇది ఒట్టి పుకార్ నా లేక నిజమెంత అంటే కాలమే దీనిని జవాబు చెప్పాల్సి ఉంది అని అంటున్నారు

## విద్యుత్ వైర్లు కట్ చేస్తున్న గంజాయి బ్యాచ్

గుంటూరు, జూన్ 26,గుంటూరు నగరంలోని ముస్లిం కాలేజ్ ప్రాంతం.. 33 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ కు అంతరాయం ఏర్పడటంతో స్థానికుల నుండి వరుస ఫోన్లు వచ్చాయి. అర్ధరాత్రి సమయంలో పెదకాకాని పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ కు అంతరాయం ఏర్పడటంతో వరుసగా ఫోన్లు వస్తున్నట్లు సిబ్బంది గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన అధికారులు సిబ్బంది హుటాహుటిన ఆ సబ్ స్టేషన్ పరిధిలో ఎక్కడ సమస్య వచ్చింది చూసి వెంటనే పరిష్కరించారు. ఇదే తరహాలో వారం రోజుల క్రితం రామిరెడ్డి తోట పరిధిలో కూడా అర్ధరాత్రి సమయంలో పవర్ నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అయితే ఇలా వరుసగా జరగటంతో విద్యుత్ శాఖాధికారులు ఆలోచనలో పడ్డారు. అసలు ఏంజరిగి ఉంటుందా అని లైన్లు పరిశీలించారు. వర్షం లేదు, ఈదురు గాలులు లేవు అయినా ఎందుకు అంతరాయం వస్తుందో పరిశీలించిన అధికారులకు ఆశ్చర్యపోయే పరికరాలు కొన్ని కనిపించాయి.పొడవాటి తీగలకు రాళ్ళు లేదా ఇతర వస్తువులను కట్టిన గంజాయి బ్యాచ్ లు అర్ధరాత్రి సమయంలో వాటిని విద్యుత్ లైన్ల పైకి విసురుతున్నట్లు గుర్తించారు. ఐరన్ తీగలకు రాళ్ళు కట్టి విసరడంతో అవి సులభంగా విద్యుత్ వైర్లపై పడుతున్నాయి.

# ఈ ఐదు రకాల చేపలు అస్సలే తినొద్దు.. డేంజర్!



చాలామంది చేపలలో ఉండే పోషకాలను నేపథ్యంలో చేపలను ఇష్టంగా తింటారు. అయితే చేపలను తినే వాళు ్ళ చాలా విషయాలు తెలుసుకోవాలి. ఎక్కువ మొత్తంలో చేపలను తినడం మంచిది కాదని, చేపలతో పాటు కొన్ని ఆహార పదార్థాలను కలిపి తినడం కూడా మంచిది కాదని తెలుసుకోవాలి. అంతేకాదు మరో ముఖ్యమైన విషయం కొన్ని రకాల చేపలను అస్సలు తినకూడదని ఒకవేళ తింటే ప్రాణాల మీదకే ప్రమాదం వచ్చే అవకాశం ఉ ంటుందని చెబుతున్నారు. అస్సలే తినకూడని చేపలు మనం తినకూడని చేపలలో మొదటిది క్యాట్ ఫిష్ . ఈ క్యాట్ ఫిష్ కోళ్ల వ్యర్థాలు కుళ్ళిపోయిన వాటిని తిని బ్రతుకుతాయి. క్యాట్ ఫిష్ తింటే మన శరీరంలో అనేక అనారోగ్య సమస్యలు కలుగుతాయి. క్యాట్ ఫిష్ తిన్నవారిలో క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంటుంది..క్యాట్ ఫిష్ లో ఒమేగా సిక్స్ ఆమ్లాలు ఉంటాయి. ఇవి మన నరాల వ్యవస్థను దెబ్బతీస్తాయి. కనుక క్యాట్ ఫిష్ ను తినకుండా ఉండటమే మంచిది. "చేపలతో పాటు కలిపి తినకూడని ఆహార పదార్థాలు ఇవే!" ఈ చేపలు తింటే ఆరోగ్య సమస్యలు మనం తినకూడని చేపలలో మరొకటి తిలాపియా చేప. ఈ చేపను పేదవాడి చేపగా చెబుతారు. అయితే తిలాపియా చేపలానే కనిపించే మరొక చేప నైల్ తెలాపియా చేప. ఇక ఈ చేపను తింటే ఆరోగ్య సమస్యలకు వెల్కమ్ చెప్పినట్టే. ఈ చేపలు తింటే గుండె జబ్బులు, ఆస్తమా వంటి సమస్యలు వస్తాయి. కాబట్టి ఈ చేపలను తినకూడదని చెబుతున్నారు. ఈ చేపలు తింటే కండరాలు బలహీనం ఇక మనం తినకూడని మరొక చేప ఆరెంజ్ రోఫీ చేప. ఈ చేపలో ఎక్కువ మొత్తంలో మెర్క్యూరీ ఉంటుంది. ఇది దాదాపు 100 సంవత్సరాలు కంటే ఎక్కువ కాలం జీవిస్తుంది. ఈ చేపలను గర్భిణీ స్త్రీలు, చిన్న పిల్లలు తింటే రకరకాల అనారోగ్య సమస్యలు వస్తాయి కండరాలు బలహీనంగా మారుతాయి. డిప్రెషన్ వస్తుంది. శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిని ఎదుర్కొంటారు. అలాగే మెమరీ సమస్యలు కూడా వచ్చే ప్రమాదం ఉంటుంది. టైల్ ఫిష్ తో ఆరోగ్యం డేంజర్ లో ఇక మనం తినకూడని మరొక చేప టైల్ ఫిష్. టైల్ ఫిష్ వల్ల కూడా మన ఆరోగ్యానికి హాని కలుగుతుంది. దీనిలోనూ మెర్క్యూరీ అధిక స్థాయిలో ఉంటుంది. ఈ చేప ఎక్కువగా విష రసాయనాలకు గురవు తుంటుంది . ఈ చేపలను తింటే అనేక అనారోగ్య సమస్యలు వచ్చే ప్రవ వాదం ఉంది. ముఖ్యంగా గర్భిణీ మహిళలు, పాలిచ్చే స్త్రీలు ఈ చేప లను అస్సలు తినకూడదు. " చేపలు తింటున్నారా? అయితే జాగ్రత్త!" ఈల్ ఫిష్ తింటే ప్రమాదం ఇక మనం తినకూడని మరొక చేప ఈల్ ఫిష్. ఎల్ ఫిష్ తినడానికి రుచికం ంగా ఉన్నప్పటికీ ఈ చేప తినడం మాత్రం డేంజర్. దీని రక్తం కూడా విషపూరితమైంది. ఇది మన ఆరోగ్యం పైన తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుంది. ఇది టాక్సిన్స్ ని ఎకు ్కవగా తీసుకోవడం వల్ల దీనిని తిన్నవారికి సమస్యలు, కండరాల సంబంధిత సమ స్యలు వస్తాయి. కనుక ఈ చేప లను తినకుండా ఉ ండటమే మంచిది.

# అన్ని రోగాలకు దివ్యౌషధం ఈ ఆకు... తెలిస్తే అసలు వదిలిపెట్టరు



తాంబూలం అనగానే మనందరికీ ముందుగా గుర్తుకొచ్చేది తమలపాకు. తమలపాకు లేకుండా భోజనం పూర్తికాదు. ఇది మన సంప్రదాయంగా మారిపోయింది. ఈ తమలపాకులు చాలా రోగాలకు దివ్యౌషధంలా పనిచేస్తాయని ఆరోగ్య నిపుణులు, ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. కిళ్లీకి తమలపాకు ఉండాల్సిందే. తమలపాకు చుడితేనే కిళ్లీ అవుతుంది. మన రుచుల కోసం అందులో రకరకాల పదార్థాలు కలుపుకుంటాం. తమలపాకు లేకుండా ఏ శుభకార్యం పూర్తికాదు. ఇందులో ఉండే ఔషధ గుణాలు ఎలా పనిచేస్తాయో తెలుసుకుందాం. మధుమేహాన్ని నియంత్రిస్తుంది క్రమం తప్పకుండా ప్రతిరోజు ఒక తమలపాకును తీసుకున్నా మధుమేహానికి దివ్యౌషధంలా పనిచేస్తుంది. షుగరు లెవల్స్ నియంత్రణలో ఉంటాయి. చక్కెర స్థాయిలను బాగా నియంత్రిస్తుంది. తమలపాకులో మినరల్స్?, ఫైబర్?, కార్బోహైడ్రేట్లు, పొటాషియం, కాల్షియం, విటమిన్?సితోపాటు అనేక రకాల పోషకాలున్నాయి. 84 రోజులపాటు మూడు గ్రాముల తమలపాకు పొడిని నీటిలో కలుపుకొని తాగితే రక్తంలో చక్కెర స్థాయిలు గణనీయంగా తగ్గుతాయి. దీనిపై ఒక పరిశోధన కూడా జరిగింది. యాంటీ డయాబెటిక్ సమ్మేళనాలు ఉంటాయి. "షాంపూలో ఈ ఒక్కటి కలిపి వాడండి... జుట్టు పొడుగ్గా పెరుగుతుంది" గ్యాస్ తగ్గుతుంది గ్యాస్ ను తగ్గించడంలో తమలపాకులో ఉండే ఔషధ గుణాలు చక్కగా పనిచేస్తాయి. కడుపు ఉబ్బరంతోపాటు అజీర్తి, ఎసిడిటీ లాంటి సమస్యలన్నీ తగ్గుముఖం పడతాయి. తక్షణం ఉపశమనం కలుగుతుంది. మూత్ర సమస్యలు తగ్గుతాయి ప్రతిరోజు ఒక టీ స్పూన్ తమలపాకు రసం తీసుకుంటే మూత్ర సంబంధిత సమస్యలన్నీ తగ్గుముఖం పడతాయి. నోటిలో లాలాజలం బాగా స్రవించి జీర్ణశక్తిని పెంచుతుంది. మలబద్ధకాన్ని తగ్గిస్తుంది. గుండెను ఆరోగ్యంగా ఉంచడంలో తమలపాకు చేసే మేలు ఎవరూ చేయరు. ఛాతీలో నొప్పి, గుండెలో మంట ఉంటే టీ స్పీన్ తమలపాకుల రసాన్ని తాగితే తక్షణం ఉపశమనం లభిస్తుంది. దగ్గు, జలుబుతో బాధపడేవారు. ఆవనూనె తీసుకొని తమలపాకులకు రాసి వెచ్చగా చేసి ఛాతీపై ఉంచితే వ్యాసకోశ సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. మోతాదు మించకుండా చూసుకోవాలి.

# ఖాళీ కడుపుతో ఈ పండ్లు అస్సలు తినకూడదు? తిన్నారంటే?

ఆరోగ్యకరమైన జీవనశైలిలో పండ్లు చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. అయితే, అన్ని పండ్లను ఖాళీ కడుపుతో తినడం మంచిది కాదు. కొన్ని పండ్లలోని ఆమ్లాలు, ఫైబర్, ఇతర పోషకాలు ఖాళీ కడుపుతో తీసుకున్నప్పుడు జీర్ణ సమస్యలు, అజీర్ణం వంటి సమస్యలకు దారితీయవచ్చు. ఖాళీ కడుపుతో తినకూడని కొన్ని ముఖ్యమైన పండ్లను, వాటి వల్ల కలిగే ప్రతికూల ప్రభావాలను చూద్దాం. 1. అరటి పండ్లు ఖాళీ కడుపుతో అరటి పండ్లు తింటే రక్తంలో మెగ్నీషియం స్థాయిలు ఒక్కసారిగా పెరుగుతాయి. మెగ్నీషియం పెరగడం వలన రక్తంలో పొటాషియం సమతుల్యత చెడిపోవచ్చు. ఇది గుండె ఆరోగ్యానికి హాని కలిగిస్తుంది. ఖాళీ కడుపుతో కల్లు తినడం వల్ల కొందరికి పేగు సమస్యలు, అలసట వంటి సమస్యలు రావచ్చు. అలాగే దీనిలో సహజ చక్కెరలు అధికంగా ఉండటంతో రక్తంలో చక్కెర స్థాయిలను అనవసరంగా పెంచే ప్రమాదం ఉంది. "పండ్లు తినడం మంచిదా? జ్యూస్ తాగడం మంచిదా?" 2. పులుపు పండ్లు పులుపు పండ్లు అయిన నిమ్మకాయ, నారింజ, ముసంబి వంటి వాటిలో యాసిడ్ అధికంగా ఉంటుంది. ఖాళీ కడుపుతో ఈ పండ్లు తింటే పేగుల మీద అనవసరమైన ఒత్తిడి పెరుగుతుంది, ఇది గ్యాస్, కడుపు ఉబ్బరం, కడుపు మంట వంటి సమస్యలకు దారితీస్తుంది. ప్రత్యేకంగా కడుపులో సున్నితత్వం ఉన్నవారు ఈ పండ్లు ఖాళీ కడుపుతో తినడం వల్ల ఎక్కువ ఇబ్బందులు ఎదుర్కొనవచ్చు. 3. పుచ్చకాయ పుచ్చకాయలో అధిక నీటితో పాటు సహజ చక్కెరలు కూడా ఉంటాయి. ఖాళీ కడుపుతో పుచ్చకాయ తింటే, ఇది కొందరికి గ్యాస్ సమస్యలను, జీర్ణ సమస్యలను కలిగించవచ్చు. ఖాళీ కడుపుతో నీటివంటివి ఎక్కువగా తినడం వల్ల, శరీరంలో కొన్ని జీవక్రియలు అసంతులితం కావచ్చు. పుచ్చకాయను మధ్యాహ్నా సమయంలో తినడం మంచిది, దీనివల్ల జీర్ణవ్యవస్థ సజావుగా పనిచేస్తుంది. 4. ఆపిల్ ఆపిల్ మంచి పండే అయినా, ఖాళీ కడుపుతో తింటే అందులోని ఫ్రక్టోస్ మరియు పెక్టిన్ వంటి పదార్థాలు కొందరికి జీర్ణ సమస్యలను కలిగించవచ్చు. పెక్టిన్ జీర్ణవ్యవస్థపై ప్రభావం చూపించి, కడుపు నొప్పి వాయువు వంటి సమస్యలను కలిగించవచ్చు. ఉదయం ఆపిల్ తినడం ద్వారా లాభాలకంటే ఇబ్బందులు రావచ్చు, కాబట్టి ఇది భోజనం తర్వాత తినడం ఉత్తమం.

# ఆరోగ్యంగా ఉండాలంటే ఈ వైట్ ఫుడ్స్ తినడం మానేయండి..



లేకపోతే ఎన్ని సమస్యలో..? ఆరోగ్యంగా ఉండేందుకు మనం తీసుకునే ఆహారంలో కొన్ని మార్పులు చేసుకోవడం అవసరం. ముఖ్యంగా మనం గత కొంతకాలంగా తీసుకుంటున్న "వైట్ ఫుడ్స్" (సముద్రపు ఉప్పు, చక్కెర, తెల్ల రవ్వ, తెల్ల బియ్యం, పాలు)ను తగ్గించడం వల్ల ఆరోగ్యకరంగా ఉంటాం. ఇవి తక్కువ పోషక విలువ కలిగి ఉండి, అధిక ప్రాసెసింగ్ ద్వారా సహజ గుణాలను కోల్పోతాయి. ఈ నేపథ్యంలో, ఆరోగ్యానికి ప్రతికూల ప్రభావం చూపే ముఖ్యమైన వైట్ ఫుడ్స్ గురించి చూద్దాం. 1. రిఫైన్డ్ చక్కెర రిఫైన్డ్ చక్కెర అనేది అధిక ప్రాసెసింగ్ ద్వారా తయారు చేయబడినది, ఇందులో విటమిన్లు, ఖనిజాలు పూర్తిగా తగ్గిపోతాయి. ఇది శరీరంలో రక్తంలో చక్కెర స్థాయిలను వేగంగా పెంచుతుంది, దీని వల్ల బరువు పెరుగుదల, డయాబెటీస్, గుండెజబ్బులు వంటి సమస్యలు ఏర్పడే అవకాశం ఉంటుంది. తీపి కోసం సహజ చక్కెరలైన తేనె, చెరకు పాన్, పంచదార వంటి పద్ధతులు ప్రయత్నించవచ్చు. మోమోస్ తిని మృతి చెందిన మహిళ..!" 2. తెల్ల బియ్యం తెల్ల బియ్యం అధికంగా ప్రాసెసింగ్ చేయబడుతుంది, ఇందులో ముఖ్యమైన పీచు, ఖనిజాలు తొలగింపబడతాయి. దీనిని అధికంగా తీసుకుంటే రక్తంలో చక్కెర స్థాయి అధికమవుతుంది, బరువు పెరుగుదల కూడా జరుగుతుంది. దీని బదులు బ్రౌన్ రైస్ లేదా ఇతర పోషకమైన గింజలను వాడడం మంచిది. 3. మైదా పిండి మైదా శరీరానికి తేలికగా జీర్ణం కాలేదు, ఇది ప్రాసెసింగ్ చేసిన పిండి కావడం వల్ల పీచు, ఖనిజాలు, పోషకాలు చాలావరకు దూరమవుతాయి. ఇది శరీరంలో త్వరగా చక్కెరగా మారి, ఇన్సులిన్ స్థాయిలను పెంచుతుంది. మైదా అధికంగా తీసుకోవడం వల్ల బరువు పెరుగుదల, జీర్ణకోశ సమస్యలు ఎదురవుతాయి. దానికి బదులుగా గోధుమపిండి వాడటం ఆరోగ్యానికి మంచిది. 4. ఉప్పు సాధారణ సముద్రపు ఉప్పులో సోడియం ఎక్కువగా ఉంటుంది, దీనిని అధికంగా తీసుకోవడం వల్ల రక్తపోటు పెరుగుతుంది. గుండెజబ్బులు వచ్చే అవకాశం ఉంటుంది. కాబట్టి సాధ్యమైనంతవరకు సీసాల్ట్, హిమాలయ ఉప్పు లేదా సహజ ఉప్పు వాడటం మంచిది. ఉప్పు పరిమాణాన్ని నియంత్రించడం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది.

# పేస్టు, బ్రష్‌ను పక్కన పెట్టేయండి.. ఈ ఒక్క పుల్లతో మీ దంతాల సమస్యలన్నీ మాయం!

వేప పుల్ల అనేది పూర్వం నుండి భారతీయుల ఆచారంలో భాగమైన ఒక సహజ పద్ధతి. వేప పుల్లతో దంతాల శు భ్రత చేయడం అనేది వేల సంవత్సరాలుగా పాటిస్తున్న ఆరోగ్యవంతమైన ప్రాచీన పద్ధతి. వేప వృక్షం ఆయుర్వేదంలో ఒక పవిత్రమైన, ఔషధ మొక్కగా పరిగణించబడుతుంది. ఈ వృక్షంలోని ప్రతి భాగం ఔషధ గుణాలను కలిగి ఉ ంటుంది, ముఖ్యంగా వేప పుల్ల దంత ఆరోగ్యాన్ని కాపాడటంలో ముఖ్యపాత్ర పోషిస్తుంది. వేప పుల్లను ఉ పయోగించడం ఆరోగ్యానికి హానికరమైన రసాయనాలు లేకుండా, దంతాలను రక్షించే అత్యుత్తమ సహజ మార్గంగా పరిగణించవచ్చు. వేప పుల్లలను ఉపయోగించడం వల్ల పర్యావరణానికి హాని లేకుండా ఉంటుంది, ఎందుకంటే ఇది పూర్తిగా ప్రకృతి సిద్ధమైనది. వేప పుల్లతో పళ్లను తోమడం అనేది పూర్వ కాలం నుండి వచ్చిన ప్రకృతి సిద్ధమైన పద్ధతి. దీని వల్ల పళ్ల శుభ్రతతో పాటు నోటి ఆరోగ్యం మెరుగుపడుతుంది. వేప పుల్లల్లో సహజంగా ఉండే యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్, మరియు యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు దంతాలను రక్షిస్తాయి. "చేపలతో పాటు కలిపి తినకూడని ఆహార పదార్థాలు ఇవే!" వేప పుల్లతో పళ్లను తోమడం యొక్క ప్రధాన ప్రయోజనాలు: 1. దంత శుభ్రత వేప పుల్ల సహజంగా ఉండే రసాయనాలు, బయో యాక్టివ్ కాంపౌండ్లు బ్యాక్టీరియాను నివారిస్తాయి. దంతాల మధ్యలో ఉన్న ఆహార కణాలను సులభంగా తొలగించగల సామర్థ్యం వేప పుల్లకు ఉంది. దీనివల్ల, దంతాల పై ఉండే బాక్టీరియా, ఇతర దంత సమస్యలను నివారిస్తుంది. ప్రతి రోజూ వేప పుల్లతో పళ్లను తోమడం ద్వారా దంతాలు ప్రకాశవంతంగా, శుభ్రంగా కనిపిస్తాయి. 2. దంత క్షయం నివారణ వేప పుల్లలో ఉండే యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్ గుణాలు దంత క్షయాన్ని నివారించడంలో సహాయపడతాయి. దంత క్షయం ప్రధానంగా బ్యాక్టీరియా వల్ల సంభవిస్తుంది, వేప పుల్లలోని ఔషధ గుణాలు బ్యాక్టీరియా పెరుగుదలను అడ్డుకుని దంత క్షయాన్ని నివారిస్తాయి. "అన్ని రోగాలకు దివ్యౌషధం ఈ ఆకు... తెలిస్తే అసలు వదిలిపెట్టరు" 3. దంత సమస్యలు తగ్గింపు వేప పుల్లలోని యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు దంత సమస్యలను తగ్గించడంలో సహాయపడతాయి. పళ్ళు తోమేటప్పుడు దంత చర్మాన్ని కూడా మర్దన చేస్తాయి, దీనివల్ల రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. వేప పుల్లతో చేయబడే మర్దన దంత ఇన్ఫెక్షన్లను తగ్గించగలదని విశ్వసిస్తారు. పళ్ళు ఊడిపోవడాన్ని అడ్డుకుని, పటిష్టంగా ఉండటానికి ఇది సహాయపడుతుంది. 4. నోటి దుర్వాసన నివారణ వేప పుల్లను ఉపయోగించడం వల్ల నోటి దుర్వాసనను తగ్గించుకోవచ్చు. నోటిలో చెడు వాసన ఏర్పడటానికి కారణమయ్యే బ్యాక్టీరియా వృద్ధిని అడ్డుకుంటుంది. వేప పుల్లలో ఉండే సహజ రసాయనాలు నోటిని సుస్వాగతమైన, తాజా వాసనతో ఉంచుతాయి. ఇది నోటికి మంచి సువాసనను ఇవ్వడంతో పాటు నోటిలో ఉండే బ్యాక్టీరియాను నాశనం చేస్తుంది. 5. ఫ్లూరైడ్ రహిత పద్ధతి నేటి దంతపానులకు ఫ్లూరైడ్ వంటి రసాయనాలు ఎక్కువగా ఉండవచ్చు, కానీ వేప పుల్ల సహజమైనది, ఏవైనా రసాయనాల జాడలు లేకుండా ఉంటుంది. వేప పుల్లను ఉపయోగించడం వల్ల ఆరోగ్యానికి ఎటువంటి దుష్ప్రభావాలు ఉండవు. ఇది సంపూర్ణ సహజమైన దంత సంరక్షణ పద్ధతిగా పరిగణించబడుతుంది. "తేనె స్వచ్ఛమైనదా? నకిలీదా? అని తెలుసుకోవడం ఎలా?" 6. ఇన్ఫెక్షన్లకు అడ్డుకట్ట వేప పుల్లలో యాంటీ ఫంగల్ మరియు యాంటీ బాక్టీరియల్ గుణాలు ఉంటాయి. ఇవి నోటిలోని ఇన్ఫెక్షన్లను నివారించడంలో సహాయపడతాయి. వేప పుల్లను ప్రతిరోజూ ఉ పయోగించడం వల్ల నోటి ఆరోగ్యం మెరుగుపడుతుంది, ముఖ్యంగా కవ్వడం లేదా పుళ్ళు చుట్టూ కాపడే ఇన్ఫెక్షన్లను నివారించవచ్చు. 7. తెలుపుదనం వేప పుల్ల దంతాలను సహజంగా తెల్లగా ఉంచడంలో సహాయపడుతుంది. దీని వల్ల ఆహార పదార్థాల వల్ల ఏర్పడే పచ్చని మరియు ఇతర రంగులను దంతాల నుండి తొలగించవచ్చు. వేప పుల్లను తరచుగా ఉపయోగించడం ద్వారా పళ్ళు ప్రకాశవంతంగా కనిపిస్తాయి



# స్పోర్ట్స్ న్యూస్

## వైభవ్ కోసం మరొకరికి అన్యాయం చేయాలా.. బ్యాటింగ్ కోచ్ సంచలన వ్యాఖ్యలు..!

జూనియర్ స్థాయిలో తానేంటో నిరూపించుకున్న వైభవ్ సూర్యవంశీఅంతర్జాతీయ అరంగేట్రంపై ఉత్కంఠ కొనసాగుతోంది. 15 ఏళ్లకే రికార్డుల హోరుతో ప్రపంచం దృష్టిని ఆకర్షించిన ఈ కుర్రాడు.. ఐర్లాండ్ పర్యటనలో ఆడడంపై స్పష్టత రావడం లేదు. స్క్వాడ్‌లో ఉన్నప్పటికీ తుది జట్టులో వైభవ్ ఉంటాడా? లేదా? అనేది ఎవరూ ధ్రువీకరించకపోవడమే అందుకు కారణం. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు తొలి టీ20 ఉన్నందున.. నెట్స్‌లో ఈ చిచ్చరపిడుగు భారీ షాట్లు ఆడాడు. అయినా సరే బ్యాటింగ్ కోచ్ సితాన్షు కొటాక్ మాత్రం వైభవ్ బెంచ్‌మీదే ఉండే అవకాశముందని సంచలన వ్యాఖ్యలు చేశాడు.గత



సీజన్ ఐపీఎల్ నుంచి పొట్టి క్రికెట్‌లో సంచలనంగా మారిన వైభవ్ సూర్యవంశీ ఐర్లాండ్ పర్యటనకు ఎంపికవ్వడంతో అరంగేట్రానికి వేళైందని మురిసిపోయారంతా. ఓపెనర్‌గా ఆడిస్తే అంతర్జాతీయ క్రికెట్‌లోనూ రికార్డులు బద్ధలు కొట్టేస్తాడని అందరూ అనుకుంటున్న వేళ.. వైభవ్ కాస్త ఆగాల్సిందేననే మాటలు వినిపిస్తున్నాయి. ఎందుకంటే టీ20ల్లో ఓపెనర్లుగా అభిషేక్ శర్మ, సంజూ శాంసన్ అదరగొడుతున్నారు. ఇషాన్ కిషన్ సైతం పొట్టి వరల్డ్‌కప్‌లో దంచేశాడు. వైభవ్ తుది జట్టులో ఉండాలంటే.. ఈ ముగ్గురిలో ఒకరు బెంచ్ మీదే ఉండాలి. కాబట్టి.. వైభవ్‌ను ఆడించడం కోసం ఎవరో ఒకరిని తప్పించడం సరికాదని భారత బ్యాటింగ్ కోచ్ సితాన్షు కొటాక్ అంటున్నాడు.'వైభవ్‌కు దేశం తరఫున ఆడే అవకాశం కచ్చితంగా లభిస్తుంది. అలాఅనీ, అతడిని ఆడించడం కోసం పరుగులు సాధిస్తున్న ఆటగాడిని పక్కన పెట్టేయాలని నేను అనుకోను. అయితే.. ఈ విషయం జట్టు మేనేజ్‌మెంట్ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. వైభవ్ ప్రతిభావంతుడే. నా దృష్టిలో ఒకరికి అవకాశం ఇవ్వడం కోసం మరొకరికి అన్యాయం చేయడం సరికాదు. ఎందుకంటే.. పరిణతితో ఉండడం, నిర్ణయాలు తీసుకోవడం, జట్టును గెలిపించాలనే తపన.. వంటివి ఉండడం చాలా ముఖ్యం.అందుకని వైభవ్‌ను జట్టులో ఒకడిగానే చూస్తున్నాం. ఐపీఎల్‌లో, అండర్-19 క్రికెట్‌లో మెలిగినట్టే భారత జట్టులోనూ వ్యవహరించాలని వైభవ్‌కు చెప్పాం. కోచ్ గౌతం గంభీర్ సైతం అతడికి ఇదే మాట చెప్పాడు' అని సితాన్షు మీడియా సమావేశంలో వెల్లడించాడు. భారత్, ఐర్లాండ్ మధ్య సాయంత్రం 6 గంటలకు తొలి టీ20 మొదలవ్వనుంది.

## వరల్ట్ నం.1 బౌలర్ కావడంపై స్పందించిన శ్రీ చరణి



ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్2026లో సరికొత్త రికార్డులతో భారత్ స్టార్ స్పిన్నర్ శ్రీ చరణి దూసుకుపోతుంది. ఇటీవల అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఎఅఅ) ప్రకటించిన టీ20 ర్యాంకింగ్స్‌లో ప్రపంచ నంబర్ వన్ బౌలర్‌గా అవతరించిన విషయం తెలిసిందే. దీనిపై శ్రీ చరణి స్పందిస్తూ.. ప్రస్తుతానికి తన దృష్టంతా ప్రపంచకప్ గెలవడం పైనే ఉందని స్పష్టం చేసింది. ఒకే ప్రపంచకప్ ఎడిషన్‌లో భారత్ తరఫున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా ఆమె(12×) సరికొత్త చరిత్ర సృష్టించింది.ఓల్డ్ ట్రాఫోర్డ్ వేదికగా బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో షోర్ణా అక్తర్ వికెట్ తీయడం ద్వారా శ్రీ చరణి ఈ టోర్నీలో తన 11వ వికెట్‌ను ఖాతాలో వేసుకుంది. తద్వారా 2020 ప్రపంచ కప్‌లో పూనమ్ యాదవ్ (10 వికెట్లు) పేరిట ఉన్న భారత రికార్డును ఈ 21 ఏళ్ల యువ స్పిన్నర్ బద్దలు కొట్టింది.ఈ సందర్భంగా ఓతో ఆమె మాట్లాడుతూ.. 'ప్రస్తుతం నా దృష్టి పూర్తిగా ప్రపంచకప్‌పైనే ఉంది. వ్యక్తిగత ర్యాంకింగ్స్ సంతోషాన్ని ఇస్తాయి, కానీ అవి నా ప్రాధాన్యత కాదు. సరైన లైన్ అండ్ లెంగ్త్‌తో బౌలింగ్ చేస్తూ జట్టుకు విజయాన్ని అందించడమే నా కర్తవ్యం' అని పేర్కొంది. బంగ్లాదేశ్ మ్యాచ్‌లో తన బౌలింగ్‌లో మూడు క్యాచ్‌లు చేజారినప్పటికీ ఒత్తిడికి లోనవ్వలేదని, క్యాచ్‌లు జారడం ఆటలో భాగమేనని పరిణతితో కూడిన సమాధానమిచ్చింది.షఫాలీ వర్మ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో బంగ్లాదేశ్‌పై గెలిచిన భారత్, గ్రూప్-ఎలో రెండో స్థానంలో నిలిచి సెమీస్ అవకాశాలను మెరుగుపరుచుకుంది. తదుపరి జరగబోయే ఆస్ట్రేలియా మ్యాచ్ అత్యంత కీలకమైనదని, అయితే తాము ఎలాంటి అదనపు ఒత్తిడి లేకుండా ఎప్పటిలాగే ప్రణాళికలను పక్కాగా అమలు చేస్తామని చరణి ధీమా వ్యక్తం చేసింది.

## అరుదైన రికార్డు సాధించిన న్యూజిలాండ్ ఓపెనర్లు

ఇంగ్లండ్‌తో నిన్న (జూన్ 25) మొదలైన నిర్ణయాత్మక మూడో టెస్ట్‌లో న్యూజిలాండ్ ఓపెనర్లు టామ్ లాథమ్, డెవాన్ కాన్వే చరిత్ర సృష్టించారు. ఈ మ్యాచ్‌లో ఇద్దరూ భారీ శతకాలతో కదంతొక్కి.. తొలి వికెట్‌కు రికార్డు స్థాయిలో 317 పరుగులను నెలకొల్పారు. తద్వారా న్యూజిలాండ్ టెస్ట్ క్రికెట్ చరిత్రలో అత్యధిక ఓపెనింగ్ భాగస్వామ్యం నెలకొల్పిన జోడీగా వీరు సరికొత్త రికార్డు నెలకొల్పాడు.1930లో వెల్లింగ్టన్‌లో ఇంగ్లండ్‌పై స్టీవీ డెంప్ స్టర్, జాకీ మిల్స్ 276 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. దాదాపు 96 ఏళ్ల తర్వాత ఆ రికార్డును బద్దలుకొడుతూ.. లాథమ్, కాన్వే భారీ భాగస్వామ్యాన్ని(317) నెలకొల్పారు. విదేశీ గడ్డపై న్యూజిలాండ్‌కు ఇది రెండో అత్యధిక భాగస్వామ్యం. 1972లో జార్జ్‌టౌన్‌లో వెస్టిండీస్‌పై న్యూజిలాండ్ ఓపెనర్లు టెర్రీ జార్విస్, గ్లెన్ టర్నర్‌ల చేసిన 387 పరుగులు అత్యధిక ఓపెనింగ్ భాగస్వామ్యంగా నిలిచింది.భారీ సెంచరీల అనంతరం లాథమ్ 151 పరుగులు, కాన్వే 157 పరుగుల వద్ద ఔటయ్యారు. ఈ ఇన్నింగ్స్‌లతో లాథమ్, కాన్వే మరిన్ని రికార్డులు కూడా తమ ఖాతాలో వేసుకున్నారు. ఒకే ఇన్నింగ్స్‌లో సెంచరీలు చేసిన తొలి న్యూజిలాండ్ ఓపెనింగ్ జోడీ రికార్డుల్లోకెక్కారు. ఓపెనర్ లాథమ్




తన టెస్టు కెరీర్‌లో 17వ సెంచరీ నమోదు చేశాడు. న్యూజిలాండ్ కెప్టెన్‌గా ఇంగ్లండ్‌లో టెస్టు శతకం బాదిన తొలి కెప్టెన్‌గా 22 ఏళ్ల రికార్డును తిరగరాశాడు.లాథమ్-కాన్వే జోడీ మరో అరుదైన ఘనతను కూడా సాధించింది. టెస్టు క్రికెట్‌లో 2వేల పరుగులు పూర్తి చేసిన తొలి న్యూజిలాండ్ ఓపెనింగ్ జోడీగా చరిత్ర సృష్టించింది. అలానే టెస్టుల్లో రెండోసారి 200కిపైగా పరుగుల భాగస్వామ్యం నమోదు చేసిన న్యూజిలాండ్ దిగ్గజ జోడీల జాబితాలో లాథమ్-కాన్వే చేరారు. గతంలో ఈ జాబితో మార్టిన్ క్రో-ఆండ్రూ జోన్స్, బ్రెండన్ మెక్‌కల్లమ్-కేన్ విలియమ్సన్ ఉన్నారు. కాగా, 3 మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో ఇంగ్లండ్ తొలి టెస్ట్ గెలవగా.. న్యూజిలాండ్ రెండో టెస్ట్ గెలిచింది. ఈ మ్యాచ్ గెలిచిన జట్టు సిరీస్ కైవసం? చేసుకుంటుంది.

## విరుచుకుపడ్డా నల్గొండ నైట్స్.. వరంగల్ ఎదుట భారీ లక్ష్యం

హైదరాబాద్: టిజి-20 లీగ్‌లో భాగంగా వరంగల్ వారియర్స్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో నల్గొండ్ నైట్స్ ఆటగాళ్లు విరుచుకుపడ్డారు. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 259 పరుగులు చేశారు. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కి దిగిన నల్గొండ జట్టు ఈ సీజన్‌లోనే అత్యధిక స్కోర్ చేసింది. ఓపెనర్ గౌరవ్ రెడ్డి (81), నితీశ్ రెడ్డి (81) అర్ధ శతకాలు సాధించారు. కెప్టెన్ రాహుల్ బుద్ధి (31), అర్ఫాజ్ అహ్మద్ (33) కీలక పరుగులు చేశారు. ఆఖర్లో దివేశ్ సింగ్ (18 నాటౌట్) వేగంగా పరుగులు రాబట్టాడు. వరంగల్ బౌలింగ్‌లో అబ్దుల్ మాలిక్ 2, ముదాస్సర్, శౌనక్ చెరో వికెట్ తీశారు.




## వైభవ్ సూర్యవంశీ తన సహజమైన ఆటనే కొనసాగించాలి : రవిచంద్రన్ అశ్విన్



భారత్ నయా సంచలనం వైభవ్ సూర్యవంశీపైనేఇప్పుడు ప్రపంచ దృష్టి అంతా ఉంది. 15 ఏళ్ల ఈ కుర్రాడు భారత క్రికెట్ జట్టులోకి ఎంపికైన అత్యంత పిన్న వయస్కుడిగా రికార్డు సృష్టించాడు. ఇండియా ఐర్లాండ్, ఇంగ్లాండ్‌ల సిరీస్‌లలో తలపడనున్న నేపథ్యంలో ప్రముఖ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్‌కీలక వ్యాఖ్యలు చేశారు. 15 ఏళ్ల వయస్సులోనే సంచలన బ్యాటింగ్‌తో అందరి దృష్టిని ఆకర్షిస్తున్న వైభవ్ పై అంచనాల భారం ఎక్కువగా ఉందని, వాటిని పక్కన పెట్టి ఎలాంటి ఒత్తిడి లేకుండా తన ఆటను ఆస్వాదించాలని అశ్విన్ సూచించాడు.భారత జట్టు తరఫున ఆడే అవకాశం వచ్చినప్పుడు ఆటను ఆస్వాదించాలన్నారు. తన సొంత ఊరి వీధుల్లో ఆడుకున్నట్లుగానే, ఈ ఆటను కూడా ఆస్వాదించాలని అశ్విన్ తన వ్యక్తిగత అభిప్రాయాన్ని వెల్లడించారు. ఇంటర్నేషనల్ క్రికెట్ ఆడేటప్పుడు అతడిపై అంచనాలు, ఒత్తిడి రావడం సహజమని, అయితే వీలైనంత వరకు వాటిని దూరం పెట్టాలని సూచించాడు.వైభవ్ ఇటీవల 'ఇండియా ఎ' (ఎనిటతిజీ ం) తరఫున శ్రీలంకలో ముక్కోణపు సిరీస్‌లో అద్భుతంగా ఆడాడు. అందులో ఫైనల్ మ్యాచ్‌లో విజయంలో కీలక పాత్ర పోషించే ఇన్నింగ్స్ ఆడాడని ప్రశంసించాడు. అతను ప్రత్యేకమైన ఆటగాడని పొగడ్తలతో ముంచెత్తాడు. వైభవ్ విషయంలో కేవలం దూకుడైన బ్యాటింగ్ శైలి మాత్రమే కాదు, పరిస్థితులకు అనుగుణంగా బ్యాటింగ్ చేసే సామర్థ్యం కూడా ఉందన్నారు.

## నెట్స్‌లో వైభవ్ సూర్యవంశీ భారీ షాట్లు..



బెల్‌ఫాస్ట్: ఐర్లాండ్‌తో ఇవాళ టీమిండియా తొలి టీ20 మ్యాచ్ ఆడనున్నది. బెల్‌ఫాస్ట్ వేదికగా ఆ మ్యాచ్ జరగనున్నది. అయితే 15 ఏళ్ల సూర్యవంశీ ఆ మ్యాచ్ కోసం తీవ్రంగా శ్రమించాడు. వాస్తవానికి తుది జట్టులో అతనికి చోటు దక్కుతుందో లేదో తెలియదు. కానీ టీమిండియా ప్లేయర్లతో కలిసి తొలిసారి నెట్స్‌లో జోరుగా ప్రాక్టీస్ చేశాడు వైభవ్. ఇటీవల ముగిసిన ఐపీఎల్‌లో మేటి బౌలర్లను ఉతికారేసిన సూర్యవంశీ.. ఆ ఊపులోనే నెట్స్‌లో కూడా భారీ షాట్లు కొట్టాడు. సూర్యవంశీ ప్రాక్టీస్‌కు చెందిన ఓ వీడియోను ఇవాళ బీసీసీఐ తన ఎక్స్ అకౌంట్‌లో పోస్టు చేసింది. టీనేజ్ ఓపెనర్ వైభవ్.. భారీ షాట్లతో నెట్స్ బౌలర్లను వణికించాడు. ఎటువంటి భయం లేకుండానే .. టీమిండియా బౌలర్లను ఆడుకున్నాడు. రకరకాల షాట్లతో ఐర్లాండ్‌తో మ్యాచ్ కోసం వైభవ్ ప్రిపేరయ్యాడు. ఆ వీడియోను మీరూ వీక్షించాడు.

## పోరాడి ఓడిన అమెరికా.. తుర్కియే చేతిలో 2-3తో పరాజయం!

ఫిఫా ప్రపంచ కప్ 2026 టోర్నీ ఎంతో ఆసక్తికరంగా సాగుతోంది. చిన్న జట్లు సైతం పెద్ద జట్లకు గట్టి పోటీ ఇస్తున్నాయి. అంతేకాక కొన్ని మ్యాచుల్లో విజయం సాధించి, ఇంకొన్ని మ్యాచుల్లో డ్రా చేసుకుంటూ పెద్ద జట్లకు గట్టి షాక్ ఇస్తున్నాయి. అలానే తాజాగా తుర్కియే సంచలన విజయం నమోదు చేసింది. గ్రూప్-డిలో ఇప్పటికే అగ్రస్థానంతో నాకౌట్‌కు అర్హత సాధించిన అమెరికాను 3-2 తేడాతో తుర్కియే ఓడించింది. ఈ లీగ్ నుంచి ఇప్పటికే నిష్క్రమించిన తుర్కియే.. పరువు కాపాడుకునేందుకు ఆడిన ఈ మ్యాచ్‌లో అద్భుత పోరాటపటిమను కనబరిచింది. సోఫియా స్టేడియంలో ప్రేక్షకుల కేరింతల మధ్య జరిగిన ఈ పోరు ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగింది.ఈ మ్యాచ్‌లో అమెరికా తొమ్మిది మార్పులతో బరిలోకి దిగింది. మ్యాచ్ ప్రారంభమైన 3వ నిమిషంలోనే సెల్టిక్ డిఫెండర్ ఆస్టన్ ట్రస్టీ లభించిన కార్నర్ అవకాశాన్ని గోల్‌గా మలిచి అమెరికాకు 1-0 ఆధిక్యాన్ని అందించాడు. వెంటనే తుర్కియే స్టార్ ప్లేయర్ అర్దా గులెర్ కూడా 10వ నిమిషంలోనే మెరుపు గోల్‌తో స్కోరును సమం చేశాడు. ఆ తర్వాత 31వ నిమిషంలో ఎల్మాలి పాస్‌ను బారిస్ యిల్మాజ్ గోల్‌గా మలిచాడు. దీంతో ప్రథమార్ధంలో తుర్కియే 2-1 ఆధిక్యంలో నిలిచింది.రెండవ అర్ధభాగంలో పుంజుకున్న అమెరికా తరఫున 49వ నిమిషంలో సెబాస్టియన్ బెర్‌హాల్టర్ చక్కని లో-షాట్‌తో స్కోరును 2-2తో సమం చేశాడు. అనంతరం స్టార్ ఆటగాడు క్రిస్టియన్ పులిసిక్ మైదానంలోకి రావడంతో స్టేడియం మార్మోగిపోయింది. పులిసిక్ గోల్ కొట్టేందు కొన్ని అద్భుత ప్రయత్నాలు చేసినప్పటికీ తుర్కియే డిఫెండర్ల శ్రేణిని ఛేదించలేకపోయాడు. ఈ క్రమంలో అందరూ మ్యాచ్ డ్రాగా ముగుస్తుందని భావించారు. అయితే చివరి నిమిషంలో తుర్కియే ఆటగాడు కాన్ అయ్హాన్ సాధించిన గోల్ అమెరికాను కోలుకోలేని దెబ్బతీసింది. ఈ ఓటమి నాకౌట్ పోరుకు ముందు అమెరికాకు హెచ్చరికలాంటిదని విశ్లేషకులు భావిస్తున్నారు. అలానే జపాన్-స్వీడన్ మ్యాచ్ 1-1తో డ్రా ముగిసింది.



# సినిమా

## వారసత్వం ఉన్నా...కష్టపడితేనే ఫలితం

### ప్రేక్షకులు ఊరికే ఆదరిస్తానుకోరాదు

### నటుడు రామ్ చరణ్



సినిమా నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చినప్పటికీ.. ప్రేక్షకులు ఎప్పుడూ నటుడి నటను చూసే ఆదరిస్తారని రామ్ చరణ్ అన్నారు. తాజాగా ఆయన 'రిపబ్లిక్ సమ్మిట్'లో పాల్గొని ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. బిజినెస్ భాషలో చెప్పాలంటే.. 'పెద్ది' సినిమా తన కెరీర్‌కు బెస్ట్ 'స్టార్టప్' లాంటిదని వెల్లడించారు. నా చిన్నప్పుడు దర్శకులు, నిర్మాతలు 'మీ నాన్న కంటే బాగా చేయాలి' అని చెప్పినప్పుడు బాధ్యతగా అనిపించేది. నేను ఆ ఒత్తిడిని పెద్దగా పట్టించుకోలేదు. మా నాన్న ఇంట్లో సరదాగా ఉంటారు. మా డైనింగ్ టేబుల్ మీద సినిమా చర్చలు, స్టార్డమ్ ముచ్చట్లు ఎప్పుడూ రానిచ్చేవారు కాదు. సినిమా నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి రావడం వల్ల త్వరగా ఒక మంచి వేదిక దొరుకుతుందనేది నిజమే.. కానీ, ప్రేక్షకులు మనల్ని ఎవరి వారసుడు అని చూడరు.. మొదటి సినిమా తర్వాత కేవలం మన కష్టం, నిజాయతీ మాత్రమే చూస్తారు. నా 15 ఏళ్ల కెరీర్‌లో ఆయన నాకు ఎప్పుడూ నటన పరంగా ఫీడ్‌బ్యాక్ ఇవ్వలేదు. నన్ను వేలు పట్టి నడిపించలేదు. కానీ క్రమశిక్షణ విషయంలో ఆయనే నాకు స్ఫూర్తి అని చెప్పారు. ఓటీటీల ట్రెండ్ గురించి మాట్లాడుతూ.. థియేటర్లు, ఓటీటీలు రెండూ ఒకదానికొకటి సాయం చేసుకుంటూ ముందుకు సాగాలి. 'ఆర్ఆర్ఆర్' థియేటర్లలో విడుదలైన తర్వాత నెట్‌ఫ్లిక్స్‌లో అందుబాటులోకి వచ్చింది. దానివల్ల పాశ్చాత్య దేశాల ప్రజలకు కూడా సినిమా చేరి, ఆస్కార్ నామినేషన్ వరకు వెళ్లేలా క్రేజ్ పెరిగింది. భారతదేశంలో ఇప్పటికీ ఒక కుటుంబానికి అత్యంత తక్కువ ఖర్చుతో దొరికే వినోదం సినిమానే. థియేటర్లలో పాప్‌కార్న్ ధరలు కాస్త తగ్గితే ఇంకా బాగుంటుంది. సినిమా అనేది ఓ భావోద్వేగం.. అది ఎప్పటికీ అలానే ఉంటుంది. దేశభక్తి కథలకు ఎప్పుడూ ప్రాధాన్యతనివ్వాలి. ఒక సినిమా రూ.500 కోట్లు లేదా రూ.800 కోట్లు వసూలు చేస్తోందంటే, దానర్థం దేశంలోని ప్రజలు ఆ కథను తమ సొంత కథగా భావించి ఆదరిస్తున్నారనే. దేశాన్ని ఏకం చేసే ఇలాంటి సినిమాలు రావడం గొప్ప విషయం' అని రామ్ చరణ్ తెలిపారు.



## బాలకృష్ణ- కొరటాల కాంబో

### 25న షూటింగ్ ప్రారంభానికి ముహూర్తం




బాలకృష్ణ కథానాయకుడిగా కొరటాల శివ దర్శకత్వంలో ఓ సినిమా రానున్న విషయం తెలిసిందే. 'ఎన్‌బికె 112'గా ప్రచారంలో ఉంది. ఈ సినిమా షూటింగ్ త్వరలో ప్రారంభం కానుంది. తాజాగా ఆ వివరాలను చిత్రబృందం పంచుకుంది. జూన్ 25న వెంకటపాలెంలోని వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఈ సినిమా ప్రారంభోత్సవం జరగనుంది. ముఖ్య అతిథులుగా మంత్రులు నారా లోకేశ్, కందుల దుర్గేశ్ హాజరు కానున్నారు. మే నెలలో ఈ ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటించారు. 'అధికారానికి ఉద్దేశం తోడైతే.. అది ఉద్యమంగా మారుతుంది' అనే పవర్‌ఫుల్ కొటేషన్‌తో టీమ్ దీనిపై అంచనాలు పెంచేసింది. కొరటాల శివ మార్కు సామాజిక సందేశంతో పక్కా మాస్ యాక్షన్ ఎంటర్ టైనర్‌గా ఈ సినిమా ఉండనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం బాలయ్య.. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో ఓ సినిమాలో నటిస్తున్నారు. 'వీరసింహారెడ్డి' తర్వాత బాలకృష్ణ - గోపీచంద్ మలినేని దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రమిది. కాజల్ కథానాయికగా నటిస్తుండగా.. మంచు మనోజ్ ఓ కీలక పాత్రని పోషిస్తున్నారు. ఈ రెండు సినిమాలను బాలకృష్ణ ఒకేసారి పూర్తి చేయనున్నట్లు వార్తలు వస్తున్నాయి.

## ప్రేక్షకుల దృక్కోణం మారింది

### అందుకే జాగ్రత్తలు తీసుకుంటున్నా: సాయిదుర్గా తేజ్

సాయి దుర్గా తేజ్ ప్రధానపాత్రలో తెరకెక్కుతోన్న చిత్రం 'సంబరాల ఏటిగట్టు'. రోహిత్.కె.పి దర్శకత్వంలో రానుంది. ఈ సినిమా విడుదల ఆలస్యం కావడంపై గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో రకరకాల చర్చలు నడుస్తున్నాయి. తాజాగా ఈ ఆలస్యంపై సాయి దుర్గా తేజ్ స్పందించారు. సినిమాల ఎంపికలో తాను ఎందుకు ఇంత సమయం అవసరమవుతోందో వివరించారు. ప్రస్తుతం ప్రేక్షకులు ఓటీటీల్లో ఎన్నో సినిమాలు, వెబ్‌సిరీస్‌లు వీక్షిస్తున్నట్లు తెలిపారు. అన్ని జానర్‌లలోని కంటెంట్ గురించి ఎన్నో విషయాలు నేర్చుకుంటున్నట్లు చెప్పారు. ప్రేక్షకుల ఆలోచనల్లో మార్పు వచ్చిందని అందుకే తన సినిమాల విషయంలో మరింత జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వాళ్లను మెప్పించాలంటే కథల ఎంపికలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించక తప్పదన్నారు. అందుకే కాస్త సమయం పడుతోందని స్పష్టం చేశారు. ఈ సినిమా కోసం తన సర్వస్వం ధారపోస్తూ... శాయశక్తులా శ్రమిస్తున్నట్లు గతంలో సాయి దుర్గా తేజ్ తెలిపారు. దర్శకుడు రోహిత్ విజన్ అందరికీ నచ్చేలా ఉంటుందన్నారు. మంచి బృందంతో కలిసి చేస్తున్న ఈ సినిమా తన కెరీర్‌లో ఒక అద్భుతంలా నిలిచిపోతుందని చెప్పారు.



## కలెక్షన్లలో మా ఇంటి బంగారం దూకుడు

### పాజిటివ్ టాక్‌తో ప్రేక్షకుల ఆదరణ




స్టార్ హీరోయిన్ సమంత ప్రధాన పాత్రలో నటించిన 'మా ఇంటి బంగారం' బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన వసూళ్లతో దూసుకుపోతోంది. దాదాపు మూడు సంవత్సరాల విరామం తర్వాత సమంత నుంచి వచ్చిన ఈ చిత్రం ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ పొందుతూ విజయపథంలో కొనసాగుతోంది. మొదటి రోజు నుంచే పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకున్న ఈ మూవీ, వీకెండ్‌లో మరింత జోరు చూపించి భారీ కలెక్షన్లను నమోదు చేసింది. సాధారణంగా స్టార్ హీరోల సినిమాలకు కనిపించే స్థాయిలో 'మా ఇంటి బంగారం'కు ప్రేక్షకుల నుంచి స్పందన లభిస్తోంది. మొదటి రోజు మంచి ఓపెనింగ్స్ సాధించిన ఈ చిత్రం, శనివారం, ఆదివారం రోజుల్లో మరింత మెరుగైన వసూళ్లను రాబట్టింది. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం, కేవలం మూడు రోజుల్లోనే మా ఇంటి బంగారం సినిమా ఇండియా వైడ్ నెట్ కలెక్షన్లలో రూ.23.10 కోట్ల మార్కును దాటేసింది. ఈ మూడు రోజుల్లో సినిమా సాధించిన మొత్తం ఇండియా గ్రాస్ కలెక్షన్లు రూ.26.69 కోట్లకు చేరాయి. సమంతకు ఉన్న క్రేజ్ కారణంగా ఈ చిత్రానికి తెలుగు రాష్ట్రాల్లోభారీ స్పందన లభించింది. కేవలం తెలుగు వెర్షన్ నుంచే మూడో రోజు రూ.9.50 కోట్ల నెట్ కలెక్షన్లు రావడం విశేషం. కుటుంబ ప్రేక్షకులు, మహిళలు, యువత ఈ చిత్రానికి పెద్ద ఎత్తున థియేటర్లకు రావడంతో అనేక ప్రాంతాల్లో హౌస్‌ఫుల్ బోర్డులు కనిపించాయి. ముఖ్యంగా మౌత్ టాక్ సినిమాకు అతిపెద్ద బలంగా మారింది. సినిమా చూసిన ప్రేక్షకులు సోషల్ మీడియాలో తమ అభిప్రాయాలను పంచుకోవడం, కుటుంబంతో కలిసి చూడదగిన చిత్రంగా ప్రశంసించడం వల్ల వసూళ్లు రోజురోజుకూ పెరుగుతున్నాయి. తెలుగు చిత్ర పరిశ్రమలో లేడీ ఓరియెంటెడ్ సినిమాలకు భారీ ఓపెనింగ్స్ సాధించడం అరుదుగా కనిపిస్తుంది. అయితే 'మా ఇంటి బంగారం' ఆ రికార్డులను తిరగరాస్తూ, సమంత స్టార్‌డమ్‌కు మరోసారి నిదర్శనంగా నిలిచింది. సినిమాలో సమంత నటన, ఎమోషనల్ సన్నివేశాలు, యాక్షన్ ఎపిసోడ్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. చాలా కాలం తర్వాత ఆమె పూర్తి స్థాయి ప్రధాన పాత్రలో కనిపించడంతో అభిమానులు కూడా థియేటర్లకు భారీగా తరలివస్తున్నారు. ఈ చిత్రానికి దర్శకురాలు నందిని రెడ్డి తనదైన శైలిలో కుటుంబ భావోద్వేగాలు, హాస్యం, యాక్షన్ అంశాలను సమతుల్యంగా మిళితం చేశారు. ప్రేక్షకులను ఆకట్టుకునే కథనం, సహజమైన పాత్రల రూపకల్పన సినిమాకు ప్రధాన బలంగా నిలిచాయి. గుల్షన్ దేవయ్య, దిగంత్, గౌతమి, శ్రీముఖి తదితరులు తమ పాత్రల్లో మెప్పించగా, సమంతతో వారి సన్నివేశాలు సినిమాకు మరింత బలం చేకూర్చాయి. వీకెండ్‌లో అనేక

## అనిల్ రావిపూడి మూవీలో ఛాన్స్ అంటూ ప్రకటనలు

### అవన్నీ ఫేక్..నమ్మొద్దంటూ ప్రకటన విడుదల

ప్రస్తుతం తెలుగు ఇండస్ట్రీలోక్రేజ్ ఉన్న దర్శకుల్లో అనిల్ రావిపూడి ఒకరు. ఆయన మూవీలో నటించేందుకు ఎంతో మంది ఆసక్తి చూపుతారు. దీన్నే అదనుగా తీసుకుని కొంతమంది సరికొత్త మోసానికి తెరలేపారు. ఈ విషయం కాస్తా చిత్ర నిర్మాణ సంస్థ దృష్టికి వెళ్లడంతో అవన్నీ ఫేక్ అంటూ ప్రకటన ఇవ్వాల్సి వచ్చింది. ఇంతకీ ఏం జరిగిందంటే.. వెంకటేశ్, కల్యాణ్‌రామ్ కథానాయకులుగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఓ మూవీ రూపొందుతున్నది. కీర్తి సురేశ్, కృతిశెట్టి కథానాయికలు. ఇటీవల పూజా కార్యక్రమాలతో ఈ మూవీ మొదలైంది. అంతేకాదు, 'రాయల సీమ నేపథ్యం' అంటూ ప్రచారాన్ని కూడా అనిల్ రావిపూడి వినూత్నంగా ప్రారంభించారు. ఈ క్రమంలో ఇందులో నటించే అవకాశం ఇప్పిస్తామంటూ కొంతమంది సామాజిక మాధ్యమాల వేదికగా ప్రకటనలు ఇవ్వడం మొదలు పెట్టారు. దీంతో అవన్నీ ఫేక్ అంటూ నిర్మాణ సంస్థ ÷న్ స్క్రీన్స్ తెలిపింది. మా సినిమా పేరుతో ఒక నకిలీ కాస్టింగ్ కాల్ సోషల్ మీడియా, ఇతర మాధ్యమాల ద్వారా ప్రచారం అవుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఆ కాస్టింగ్ కాల్‌కు, మా చిత్ర బృందానికి ఎలాంటి సంబంధం లేదు. దయచేసి అలాంటి మోసపూరిత ప్రకటనలను నమ్మొద్దు. మా సినిమా తరఫున కాస్టింగ్ పేరుతో సంప్రదిస్తున్న వ్యక్తులకు మీ వ్యక్తిగత వివరాలు, ఫొటోలు, పత్రాలు లేదా డబ్బు ఇవ్వవద్దని విజ్ఞప్తి. మా చిత్రానికి సంబంధించిన ఏవైనా అధికారిక కాస్టింగ్ ప్రకటనలు ఉంటే, అవి కేవలం మా అధికారిక, ధ్రువీకరించిన సోషల్ మీడియా ఖాతాల ద్వారానే ప్రకటిస్తాం. జాగ్రత్తగా ఉండండి.



Printed by Published by **KALIDINDI RAJA JAGADESHWARA SANTOSH** on behalf of **KALIDINDI RAJA JAGADESHWARA SANTOSH**, Printed at and Published at 1-7-750/1-3, F 103 and 102, ST. PIOUS SCHOOL ROAD, Sruthi Sadan Apts, Ramnagar, Hyderabad-500020, Telangana. Editor **RAGHURAMA RAJU KALIDINDI.** PRGI NUMBER TGTEL/25/A3603, CELL : 9849379430, MAIL ID: kingdailynewspaper@gmail.com